
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పల్నాడు జిల్లా వార్తలు
5
బుధవారం 19 జూన్ 2024





- విత్తనాల ధరలకు రెక్కలు
- అన్నదాతలపై ఆర్థిక భారం
- సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు
- ధరల నియంత్రణను పట్టించుకోని అధికారులు

కొనాలంటే.. కష్టం

విత్తు నుంచే రైతులకు కష్టాలు మొదలయ్యాయి. విత్తనాల నుంచి రైతులపై ఆర్థిక భారం పడుతోంది. విత్తనాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. అడపాదడపా వర్షాలతో పొలాలు దున్నిన రైతులు విత్తనాల కోసం ఎగబడుతుండగా ఇదే అవకాశంగా వ్యాపారులు ధరలను పెంచేశారు. విత్తన కంపెనీలు రకరకాల మాయలతో మార్కెట్‌ను ముంచెత్తుతుండగా.. రైతులు దోపిడీకి గురవుతున్నారు. విత్తనాలు, వాటి ధరలకు సంబంధించి అధికారుల నియంత్రణ కొరవడింది. దీంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా విత్తనాల విక్రయాలు చేపడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధరలకు, వ్యాపారులు వసూలు చేసే ధరకు పొంతన ఉండటంలేదు. వ్యవసాయ శాఖ చెప్పినట్లుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడా కూడా విత్తన విక్రయాలు జరగడంలేదు. అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తున్నారే కానీ రైతుల దోపిడీకి సంబంధించి కనీస చర్యలు కూడా తీసుకోవడంలేదు. దీంతో వ్యాపారుల దోపిడీకి రైతులు బలవుతున్నారు.

నరసరావుపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురిసి పదునైన పొలాల్లో రైతులు సేద్యం మొదలుపెట్టారు. వివిధ రకాలకు సంబంధించిన విత్తనాల ధరలు మండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. రైతులు ఆసక్తి చూపుతున్న విత్తనాల ధరలను విత్తన సంస్థలు పెంచేస్తున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన ధరలకు కొన్ని రకాల విత్తనాలు మార్కెట్లో లభించడంలేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా ధరలు పెంచి కొన్ని కంపెనీలు, వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. పల్నాడు, గుంటూరు జిల్లాలో పత్తి, మిర్చి, డెల్టాలో వరి సాగు ప్రారంభమైంది. అయితే ఆయా పంటలకు సంబంధించిన విత్తనాల కొనుగోలు రైతులకు తలనొప్పిగా మారింది. పల్నాడు జిల్లాలో 3,06,250 ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసిందే కానీ ధరలకు సంబంధించి కనీస చర్యలు కూడా తీసుకోవడంలేదన్న విమర్శలున్నాయి. ఇక కొన్ని రకాల మిర్చి విత్తనాల ధర కిలో రూ.1.20 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు పలుకుతోంది. మిర్చి ధర బాగుంది. దీంతో ఈ ఏడాది ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు ప్రాంతాల్లో రైతులు ఎక్కువగా మిర్చి సాగు వైపు మొగ్గు చూపుతారని అంచనా. దీనిని విత్తన కంపెనీలు సొమ్ము చేసుకుంటున్నాయి. ఇప్పటికే రైతులు పొలాలను కౌలుకు తీసుకుంటూ.. విత్తనాల కొనుగోలుపైనా దృష్టి పెట్టారు. నల్ల తామర, వైరస్‌ను తట్టుకుంటున్నాయనే ప్రచారంతో కొన్ని రకాలపైనే రైతులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. ఆయా కంపెనీల విత్తనాల ధరలు చుక్కలంటుతున్నాయి. ఆరుమూరు, తేజ రకాల విత్తనాలను కొన్ని కంపెనీలు కిలో రూ.లక్షన్నర వరకు విక్రయిస్తున్నట్లు రైతులు చెప్పారు. మరికొన్ని రకాల విత్తనాలు కిలో లక్ష నుంచి 1.10 లక్షల వరకు ఉన్నాయంటున్నారు. అధిక ధరలకు విత్తనాల విక్రయాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. అధిక ధరలకు విక్రయిస్తున్న విత్తనాలకు, తక్కువ ధరకు లభిస్తున్న విత్తనాలకు ఉన్న తేడాను రైతులకు వివరించేందుకు వ్యవసాయ, ఉద్యాన శాఖలు కృషి చేయాలి. ఏ రకం విత్తనం వల్ల వచ్చే దిగుబడులు, ఆశించే తెగుళ్ల విషయంలో రైతులకు అవగాహన కల్పిస్తే ఎక్కువ ధరలకు విత్తనాలకు కొనుగోలు చేసి రైతులు నష్టపోకుండా అరికట్టే అవకాశం ఉంటుంది.

ప్రభుత్వ ధర రూ.864.. వసూలు రూ.1300

పత్తి విత్తనం ప్యాకెట్ ధర రూ.864గా ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ ధరకు కొన్ని రకాలే మార్కెట్లో లభిస్తున్నాయి. మరి కొన్ని రకాల ధరలను వ్యాపారులు విపరీతంగా పెంచేశారు. యూఎస్ 7067 రకం పత్తి విత్తనాల కొనుగోలుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ రకం విత్తనాలను మార్కెట్లో ప్యాకెట్ రూ.1300 వరకు విక్రయిస్తున్నట్లు రైతులు తెలిపారు. ఏషియన్ సంస్థకు సంబంధించిన మరో రకం విత్తనం ప్యాకెట్ రూ.1200 వరకు విక్రయిస్తున్నారని రైతులు చెప్పారు. ఈ రెండు రకాల విత్తనాలపై రైతులు ఆసక్తి కనబరుస్తుండటంతో వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు.



ఆటోలో విత్తనాలు తీసుకు వెళ్తున్న రైతులు





- పవన్‌కల్యాణ్‌కు రాజధాని పల్లెల్లో ఘన స్వాగతం
- సీడ్ రోడ్డుపై ఆరు కిలోమీటర్లు పూలు పరిచిన రైతులు
- ఉపముఖ్యమంత్రికి గజమాలలతో సత్కారాలు.. పూలాభిషేకాలు

అడుగడుగునా.. అభిమానం

తుళ్లూరు, జూన్ 18: గత ప్రభుత్వ హయాంలో ముళ్ల కంచెలను దాటుకుని, పోలీసు నిర్బంధాలను ఛేదించుకుని వచ్చి తమకు సంఘీభావం తెలిపిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై అమరావతి రైతులు, మహిళలు అభిమానం చాటుకున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మంగళవారం సచివాలయ సందర్శనకు వస్తున్నట్లు రైతులకు తెలిసింది. దీంతో మండుటెండలో రోడ్డుకు ఇరువైపులా రైతులు, మహిళలతో పాటు చిన్నారులు, వృద్ధులు, యువత పెద్దసంఖ్యలో ఆయనకు అపూర్వ స్వాగతం పలికారు. సీడ్ రోడ్డుపై ఆరు కిలో మీటర్లు పూల పాన్పు వేసి మరీ అభిమాన నేతను స్వాగతించారు. మధ్యాహ్నం రెండు గంటలకు సీడ్ రోడ్డుపైకి చేరిన రాజధాని గ్రామాల రైతులు, మహిళలు పవన్‌కల్యాణ్ కోసం ఎదురు చూశారు. ఆయన మూడున్నర గంటలకు వెంకటపాలెం సీడ్ రోడ్డులోకి ప్రవేశించగా గజమాలలతో రైతులు సత్కరించారు. మహిళలు పూలు చల్లుతూ స్వాగతం పలికారు. రాజధాని ఆందోళనల్లో అండగా నిలిచిన నేతపై పూల వర్షం కురిపించారు. తాళ్లాయపాలెం జంక్షన్‌లో న్యాయదేవత విగ్రహం ఉంచి న్యాయం గెలిచింది.. అన్యాయం ఓడింది.. అమరావతి నిలబడింది.. అంటూ పవన్‌కల్యాణ్ కాన్వాయ్ వచ్చే సమయం లో రైతులు, రైతు కూలీలు, మహిళలు నినాదాలు చేశారు. పవన్ కల్యాణ్ ఓపెన్ టాప్ కారులో నుంచే న్యాయదేవత విగ్రహానికి పూ లు చల్లి దండం పెట్టారు. మార్గమధ్యలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు స్వాగతం సుస్వాగతం.. అంటూ ఫ్లెక్సీలతో చిన్నా రులు, మహిళలు సందడి చేశారు. వెంకటపాలెం సీడ్ రోడ్డు నుంచి మందడం మీదగా వెలగపూడి సచివాలయానికి పవన్ కల్యాణ్ వెళ్లారు.



పవన్‌కల్యాణ్‌కు ఘన స్వాగతం పలుకుతున్న రైతులు

పోస్టింగ్‌లు.. పైరవీలు





పోస్టింగ్‌ల కోసం అధికారులు.. ఉద్యోగులు పాట్లు పడుతున్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద క్యూ కడుతున్నారు. కోరుకున్న సీటు కోసం లాబీయింగ్ చేసుకుంటున్నారు. కొందరైతే ఫలానా సీటు తనదేనంటూ కర్చీఫ్ వేసుకుంటున్నారు. కాగా.. వైసీపీతో అంటకాగిన అధికారుల్లో ఆందోళన నెలకొంది. వైసీపీ ఎమ్మెల్యే చెప్పినదాని కల్లా తలూపిన అధికారులకు ఇక గడ్డుకాలమేన్న ప్రచా రం. తెలుగుదేశం పార్టీ ముద్ర వేసి లూప్‌లైన్‌లో ఉంచిన అధికారులకు మంచి రోజులు రానున్నట్టు తెలుస్తోంది. రెవెన్యూ, పోలీసు, మునిసిపల్, పంచాయతీరాజ్ శాఖల్లో భారీగా బదిలీలు జరిగే అవకాశాలున్నాయి.

- ఎమ్మెల్యేల ఇళ్లకు క్యూ కడుతున్న అధికారులు.. ఉద్యోగులు
- కోరుకున్న పోస్టు కోసం లాబీయింగ్
- సీట్లపై కర్చీఫ్ వేసుకుంటున్న వైనం
- వైసీపీతో అంటకాగిన వారిలో ఆందోళన
- నాడు దూరంగా ఉంచిన అధికారులకు ప్రాధాన్యం

నరసరావుపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుతీరింది. మంత్రుల నియామకం పూర్తైంది. త్వరలో బదిలీల ప్రక్రియ ప్రారంభమవుతుందని అధికార వర్గాలు అంచనాకు వచ్చాయి. సమయం సమీపిస్తుండటంతో ముందుగానే ఎమ్మెల్యేలను కలసి ఫలానా పోస్టు తనకు కావాలని కొందరు అధికారులు.. ఉద్యోగులు ఇప్పటికే కోరారు. మునిసిపాల్టీలు, పంచాయతీ రాజ్, పోలీసు, రెవెన్యూ శాఖల్లో పోస్టింగ్‌ల కోసం పోటీ అధికంగా ఉంది. ఇది కొందరు ఎమ్మెల్యేలకు తలనొప్పిగా పరిణమిస్తున్నట్లు వారి అనుచరులు చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో చాలామంది అధికారులను లూప్‌లైన్ పెట్టారు. వీరందరిపై తెలుగుదేశం పార్టీ ముద్ర వేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. ఇందుకోసం అప్పట్లో వైసీపీలో కొందరు అధికారులు చక్రం తిప్పారు. వారికి నచ్చని అధికారులు, ఉద్యోగులను సుదూర ప్రాంతాలకు బదిలీ చేయించడంతో పాటు వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు.

ఉల్లంఘనులపై నజర్..

పోలీసు శాఖలో వైసీపీ ఎమ్మెల్యేలతో కొందరు అధికారులు అంటకాగి తెలుగుదేశం పార్టీ, జనసేన శ్రేణులపై అక్రమ కేసులు బనాయించడంతో పాటు పోలీసు స్టేషన్‌లకు తీసుకువెళ్లి చిత్రహింసలకు గురిచేశారు. ఇలాంటి అధికారుల పేర్లను లోకేశ్ తన రెడ్ బుక్‌లో కూడా నమోదు చేశారు. కొందరు అధికారులు వారి తోటి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేశారు. కొందరికి పోస్టింగ్‌లు ఇవ్వకుండా హింసించారు. పోలీసు శాఖలో ఇలాంటి అధికారుల జాబితాలను అధికార పార్టీ వర్గాలు సిద్ధం చేసి ఎమ్మెల్యేలకు అందజేసినట్లు చెబుతున్నారు. రెవెన్యూశాఖలో కూడా ఒక వర్గం అధికారులపై కక్ష సాధింపుకు పాల్పడింది. పంచాయతీరాజ్‌లో ఉపాధి హామీ పథకం పనులు చేయించిన టీడీపీ మద్దతు దారులైన కాంట్రాక్టర్లకు బిల్లులు రాకుండా చేశారు. ఉదాహరణకు నాడు డ్వామా పీడీగా చేసి నేడు పుడా వైస్ ఛైర్మన్‌గా పనిచేస్తున్న జి.శ్రీనివాసరెడ్డి కోట్లాది రూపాయల విలువైన పనుల బిల్లులు రాకుండా చేశారు. ప్రగతి పనులు చేసినా చేయనట్లుగా ప్రభుత్వానికి నివేదికలు పంపి కాంట్రాక్టర్లను కోలుకోలేని విధంగా దెబ్బతీశారు. ఎం - బుక్‌లను కూడా దాచేశారు. ఈ అధికారిపై తిరుగుబాటు చేయడంతో ఎం-బుక్‌లను ఇచ్చేవిధంగా అంగీకరించారు. ఇలాంటి అధికారులు అధిక సంఖ్యలోనే ఉన్నారు. వీరందరిపై చర్యలు తీసుకోవాలని, వీరికి ఎక్కడా పోస్టింగ్‌లు లేకుండా లూప్‌లైన్ ఉంచాలని ఎమ్మెల్యేలపై టీడీపీ శ్రేణులు ఒత్తిడి తెస్తున్నాయి. టీడీపీ కాంట్రాక్టర్లు చేసిన పనులకు దొడ్డిదారిన వైసీపీ వ్యక్తులు చేసినట్టుగా సృష్టించి వారికి బిల్లులు చెల్లించి న ఘనులు ఉన్నారు. నరసరావుపేటలో పంచాయతీ రాజ్‌లో ఒక ఏఈ ఈవిధంగా చేసి అడ్డంగా దొరికిపోయాడు. సదరు అధికారి రూ.10 లక్షలు తిరిగి చెల్లించే విధంగా ఒప్పందం జరిగింది. ఇలా కొందరు అధికారులు వైసీపీ నేతలు చెప్పిన పని చేసి నేడు ఇరకాటంలో పడ్డారు. మళ్లీ వైసీపీ ప్రభుత్వం వస్తుందన్న ధీమాలో అక్రమాలకు పాల్పడిన అధికారులు టీడీపీ అధికారంలోకి రావడంతో వారికి ముచ్చెమటలు పడుతున్నాయి.

అక్రమార్కుల్లో కలవరం..

రెవెన్యూ శాఖలో భూముల అక్రమాలు యథేచ్ఛగా జరిగాయి. ప్రభుత్వ భూములను వైసీపీ నేతలకు దారాదత్తం చేశారు. ఈ అవినీతి తిమింగలాల చిట్టా ను టీడీపీ శ్రేణులు సాక్షాధారాలతో సహా బయట పెడుతుండటంతో అక్రమార్కులు కలవరం చెందుతున్నారు. టీడీపీ ముద్ర వేసి పలు శాఖలో కొందరు అధికారు లను, ఉద్యోగులను వైసీపీ ఎమ్మెల్యేలు తీవ్రంగా ఇబ్బందులకు గురిచేశారు. సదరు ఎమ్మెల్యేల అండదండ లతో రెచ్చిపోయిన అధికారులకు సీన్ రివర్స్ కానుందన్న ప్రచారం జరుగుతోంది. ఐదేళ్లగా పోలీసుల శాఖలో లూప్‌లైన్‌లో ఉంచి ఇబ్బందులకు గురిచేసిన అధికారులు కూటమి అధికారంలోకి రావడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. కాగా వైసీపీలో పెత్తనం చేసిన అధికారుల కూడా కూటమి ఎమ్మెల్యేలను కలిసి బొకేలు అందజేస్తూ అభినందలు తెలియజేసి వారి వద్ద మార్కులు వేయించేకునే పనిలో ఉన్నారు. దీనిని వైసీపీ బాధిత అధికారుల జీర్ణించేకోలేక పోతున్నారు. ఎమ్మెల్యేల అనుచరులు, బంధువులు, కుటుంబ సభ్యుల ద్వారా పోస్టింగ్‌ల కోసం పూర్తి స్థాయిలో పైరవీలు చేసుకుంటున్నారు. ఫలానా పోస్టు తనదేనన్న ధీమాను కూడా కొందరు అధికారులు వ్యక్తం చేస్తుండటం వారికి ఎమ్మెల్యేతో ఉన్న లాబీయింగ్ తెలియజేస్తుంది. వైసీపీతో అంటకాగిన వారికి కూడా మంచి పోస్టులు లభించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

అధికారుల హడావుడి..

ఇంకా ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేయలేదు. వారు లెటర్‌ప్యాడ్ కూడా ముద్రించలేదు. అప్పటి వరకు ఆగలేని అధికారులు ఎమ్మెల్యేలను కలసి వారికి అనుకూలంగా ఉన్న పోస్టింగ్ కోసం మాట తీసుకుంటున్నారు. వైసీపీతో అంటకాగిన అధికారులకు కూడా పోస్టింగ్‌లలో ప్రాధాన్యం లభిస్తుందన్న ప్రచారం ఉంది. టీడీపీ ముద్ర పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న అధికారులు.. ఉద్యోగులకు న్యాయం చేస్తారా లేదా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వం బదిలీల ఉత్తర్వులు విడుదల చేయక ముందే ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద అధికారుల హడావుడి కనిపిస్తోంది. ఇప్పటికే కొందరు అధికారులు వారికి నచ్చిన పోస్టింగ్ హామీ కూడా లభించిందన్న ప్రచారం చేసుకుంటున్నారు. జీరో సీనియార్టీపై బదిలీలు ఉంటాయన్న ప్రచారం. దీంతో అన్ని శాఖల్లో బదిలీలు భారీగానే జరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

నేడు వ్యవసాయ వర్సిటీ స్నాతకోత్సవం

ముస్తాబైన బాపట్ల వ్యవసాయ కళాశాల..

హాజరుకానున్న గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్

బాపట్ల, జూన్ 18: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవానికి బాపట్ల వ్యవసాయ కళాశాల ముస్తాబైంది. 75 సంవత్సరాల చరిత్ర కలిగిన బాపట్ల వ్యవసాయ కళాశాలలో గత కొన్నేళ్లుగా వ్యవసాయ వర్సిటీ స్నాతకోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది కూడా బుధవారం 56వ స్నాతకోత్సవం నిర్వహణకు భారీగా ఏర్పాట్లు చేశారు. వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి అధ్యక్షతన స్నాతకోత్సవం జరగనున్నది. కళాశాలలోని డాక్టర్ బీవీ.నాథ్ ఆడిటోరియంతోపాటు 2016లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్నాతకోత్సవానికి విచ్చేసిన సందర్భంలో శంకుస్థాపన చేసి నిర్మించిన భవనం, కళాశాల ప్రధాన భవనాన్ని వేడుకలకు ముస్తాబు చేశారు. వేడుకలకు సంబంధించిన ఆహ్వానపత్రాలను వైస్‌చాన్స్‌లర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుధవారం ఉదయం 11.30 గంటలకు వేడుకలు జరుగుతాయన్నారు. కార్యక్రమానికి విశ్వవిద్యాలయ చాన్స్‌లర్, గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌తోపాటు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారన్నారు. ఈ వేడుకల్లో పట్టభద్రులైన 1000 మంది విద్యార్థులకు సర్టిఫికెట్‌లు, అవార్డులను పంపిణీ చేస్తామన్నారు. 17 మంది పోస్ట్‌గ్రాడ్యుయేట్స్‌కు, నలుగురు అండర్ గ్రాడ్యుయేట్‌లకు బంగారు పతకాలు ఇస్తామన్నారు. యూనివర్సిటీలో బోధన, పరిశోధన, విస్తరణ విభాగాలలో పనిచేస్తున్న 10 మంది అధ్యాపకులకు కూడా అవార్డులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, వర్సిటీ విభాగాధిపతులు డాక్టర్ ఎ.మణి, డాక్టర్ రమణ, డాక్టర్ జి.రామచంద్రరావు, డాక్టర్ పి.శ్రీలక్ష్మి, ఆహారవిజ్ఞాన సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎల్.ఏడుకొండలు, వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డిడి.స్మిత్, డాక్టర్ అనీల్ పాల్గొన్నారు.





స్నాతకోత్సవానికి ముస్తాబైన బాపట్ల వ్యవసాయ కళాశాలలోని డాక్టర్ బీవీ నాథ్ ఆడిటోరియం

65 వేల కౌలు రుణ అర్హత కార్డుల పంపిణీ

గ్రామాల వారీగా ప్రణాళిక రూపొందించాం : జేడీ

నరసరావుపేట, జూన్ 18: జిల్లాలో 65 వేల మంది కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు వ్యవసాయ శాఖ జేడీ మురళి తెలిపారు. కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రము(సి.సి.ఆర్.సి) జారీ చేసేందుకు గ్రామాల వారీగా ప్రణాళిక రూపొందించామన్నారు. గ్రామ స్థాయిలోని వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారి రోజుకి 10 సి.సి.ఆర్.సిలు చొప్పున మంజూరు చేసేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. భూ యజమానులకు, కౌలుదారులకు ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారు హక్కుల చట్టం 2019 గురించి అవగాహన కల్పించి త్వరితగతిన సి.సి.ఆర్.సిలు మంజూరు చేయాలన్నారు. సాగురైతుకు చేయూత ఇవ్వాలనే సంకల్పంతో భూ యజమాని హక్కులకు ఎలాంటి నష్టం లేకుండా కౌలు రైతుకు పంట సాగుదారు కార్డు(సి.సి.ఆర్.సి) ఇచ్చేందుకు ప్రభుత్వం చట్టం తీసుకువచ్చిందన్నారు. కార్డు కాలపరిమితి 11 నెలలు మాత్రమేనన్నారు. ఈ కార్డుపై సాగుదారు బ్యాంకు నుంచి రూ.1.6 లక్షల వరకు ఎటువంటి పూచీకత్తు లేకుండా రుణం పొందవచ్చన్నారు. ఒకవేళ తీసుకున్న రుణం సాగుదారు కట్టలేకపోతే భూయజమానిపై భారం ఉండదన్నారు.

ఎన్నికల ఖర్చుల నివేదిక అందజేయాలి

అభ్యర్థుల సమావేశంలో డీఆర్‌వో వినాయకం

నరసరావుపేట, జూన్ 18: ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు జమా ఖర్చుల వివరాలను వచ్చే నెల మూడో తేదీ లోపల నిర్ణీత నమూనాలో అందజేయాలని డీఆర్వో వినాయకం తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఇటీవల జరిగిన ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు వారి ఏజెంట్లతో డీఆర్వో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థుల జమా ఖర్చులకు వచ్చిన వివరాలను సంబంధిత నమూనాలో షెడ్యూలలో అఫిడవిట్లలో అందజేయాలన్నారు. అభ్యర్థులు తప్పకుండా నామినేషన్ నుంచి కౌంటింగ్ వరకు చేసిన ఖర్చుల వివరాలను అందజేయాలన్నారు. అలా అందజేయని అభ్యర్థులను బ్లాక్ లిస్టులో ఉంచి ఆరేళ్ల వరకు ఎన్నికల్లో పాల్గొనకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈసీ నియమించిన వ్యయ పరిశీలకుల సమక్షంలో జమ ఖర్చుల వివరాలను సమీక్షించి చర్యలు తీసుకుంటామ న్నారు. శాసన సభకి 40 లక్షలు, లోక్‌సభ నియోజకవర్గానికి రూ.95 లక్షల లోపల వ్యయ పరిమితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి ఎన్నికల పరిశీలకులు నాగ శ్రీనివాస్, వరద సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌వో వినాయకం

బాలింత, నవజాత శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ

7లో..

దిక్సూచి DIKSUCHI

వంద శాతం ఎంప్లాయిమెంట్ కల్పించే
ప్రింటింగ్ టెక్నాలజీ



పాలిటెక్నిక్ డిప్లొమాలు

డిప్లొమాలు కొన్ని ఎంప్లాయిమెంట్ కల్పించడంలో కల్పతరువులు అని చెప్పొచ్చు. అలాంటి వాటిలో ఒకటి ప్రింటింగ్ టెక్నాలజీ. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్‌లో మాత్రమే ఈ కోర్సు ఉంది. దీనిలో చేరడానికి పదో తరగతి పాసై తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిర్వహించే పాలిసెట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి. హైదరాబాద్‌లో జూ పార్క్‌కి సమీపంలోని కులి కుతుబ్‌షా (క్యూక్యూ) గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో మాత్రమే ఈ కోర్సును అందిస్తున్నారు.

కోర్సు తీరు తెన్నులు: ఆధునిక ప్రపంచంలో ముద్రణ మాధ్యమానికి ఉన్న విస్తృత అవసరాల దృష్ట్యా ప్రింటింగ్ టెక్నాలజీ డిప్లొమాను మూడు సంవత్సరాల కోర్సుగా రూపొందించారు. అత్యాధునిక ముద్రణ సాంకేతిక విధానాలైన offset, gravure, flexography, screen, digital ప్రింటింగ్ గురించి బోధిస్తారు. ఈ కోర్సులో ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థి మూడు సంవత్సరాల్లో ఆరు సెమిస్టర్లు చదవాల్సి ఉంటుంది. మొదటి రెండు సెమిస్టర్లలో రెండు ప్రింటింగ్ సబ్జెక్టులు మినహాయిస్తే మిగిలిన సబ్జెక్టులన్నీ తతిమా అన్ని డిప్లొమాలతో సమానంగా ఉంటాయి. 3, 4, 5వ సెమిస్టర్లలో పూర్తిగా ప్రింటింగ్‌కు సంబంధించిన సబ్జెక్టులు మాత్రమే ఉంటాయి.

క్షేత్రస్థాయి అవగాహన: ఈ కోర్సు ద్వారా థియరీతోపాటు ప్రాక్టికల్స్‌లో కూడా మంచి పట్టు సాధించాల్సి ఉంటుంది. ప్రింటింగ్ టెక్నాలజీ చదువుతున్న విద్యార్థులను హైదరాబాద్‌లోని ప్రముఖ ముద్రణ సంస్థల్లో ఇండస్ట్రియల్ విజిట్‌కి తీసుకుని వెళతారు. తద్వారా పారిశ్రామిక స్థితిగతులను అవగాహన చేసుకునే అవకాశం కల్పిస్తారు. చివరి సెమిస్టర్‌లో ఆరు నెలలు ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఉంటుంది. ఈ ఆరు నెలల్లో విద్యార్థి ముద్రణ రంగంలోని అన్ని విభాగాలలో పనిచేసి సంబంధిత నైపుణ్యాన్ని అలవర్చుకోవాలి. తద్వారా యంత్రాలు నడపగలిగే స్థాయికి విద్యార్థి చేరుకుంటాడు. అంతే కాకుండా నిర్వహణ సామర్థ్యానికి సంబంధించిన నైపుణ్యాలు(మేనేజ్‌మెంట్ స్కిల్స్), ఆధునిక సాంకేతికత(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్), మార్కెటింగ్ నైపుణ్యాలు(మార్కెటింగ్ స్కిల్స్)లో తర్ఫీదు పొందుతాడు.

అభిరుచికి అనుగుణంగా: ఈ కోర్సు చదివిన విద్యార్థి ముద్రణ పరిశ్రమలోని ముఖ్యమైన నాలుగు విభాగాలు ప్రి ప్రెస్, ప్రెస్ వర్క్, పోస్ట్ ప్రెస్, మార్కెటింగ్‌లలో వారి వారి ఆసక్తులను బట్టి ఎంచుకునేందుకు, సదరు విభాగాల్లో స్థిరపడేందుకు అవకాశం ఉంటుంది.

- ప్రి ప్రెస్ విభాగాన్ని డి.టి.పి & డిజైనింగ్‌లో ఆసక్తి, నైపుణ్యం ఉన్నవారు ఎంపిక చేసుకుంటారు. ప్రెస్-వర్క్ విభాగంలో యంత్ర నిర్వాహకుడిగా, పర్యవేక్షకుడిగా పెద్ద స్థాయుల్లో అవకాశాలుంటాయి. ప్రింట్ ఫినిషింగ్‌లో బైండింగ్, ప్యాకింగ్‌పై ఆసక్తి ఉన్నవారుంటారు. మార్కెటింగ్ విభాగంలో సరైన నిర్ణయాలు, అంచనా వేయగలిగిన వారు, వినియోగదారులతో వ్యాపార సంబంధాలను నెరపగలిగిన వారుంటారు.

ఉన్నత స్థానాల్లో పూర్వ విద్యార్థులు: రిజర్వ్ బ్యాంక్ కరెన్సీ ప్రెస్‌లో ఉద్యోగం పొందాలంటే డిప్లొమా ఇన్ ప్రింటింగ్ టెక్నాలజీ తప్పనిసరి. ఈ కోర్సు చేసిన తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఎంతో మంది ప్రభుత్వ రంగ సంస్థలు మింటింగ్, భారతీయ రిజర్వు బ్యాంకు, ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయాలు అలాగే ప్రైవేటు రంగంలో వివిధ ముద్రణ సంస్థల్లోనూ, పత్రికారంగంలోనూ ఉన్నత స్థాయిలో ఉన్నారు. ప్రింటింగ్ టెక్నాలజీ చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో ప్రింటింగ్ పరిశ్రమలలో అత్యున్నత స్థానాల్లో స్థిరపడ్డారు. అనుభవం గడించిన తరవాత కొందరు సొంతగా ప్రింటింగ్ ప్రెస్‌లు స్థాపించి అనేక మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్: క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఏటా క్రమం తప్పకుండా జరుగుతుంది. అందరూ దాదాపుగా ఏదో ఒక దగ్గర ఉద్యోగం పొందుతారు. కొద్ది సంవత్సరాలుగా విద్యార్థినుల సంఖ్య పెరుగుతోంది. ప్రింటింగ్ డిప్లొమా చేసే విద్యార్థినులు ఎక్కువగా డిజైన్, పోస్ట్ ప్రెస్, క్వాలిటీ కంట్రోల్ విభాగాలను ఎంచుకుంటుంటారు.

ఉన్నత విద్యావకాశాలు: ఈ డిప్లొమా కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈసెట్‌లో ఉత్తీర్ణత సాధించి లేటరల్ ఎంట్రీ ద్వారా ప్రింటింగ్ టెక్నాలజీలో మాత్రమే కాకుండా మెకానికల్, కంప్యూటర్స్, ఐ.టి., ప్రొడక్షన్ ఇంజనీరింగ్‌లలో కూడా బీటెక్ చదివే అవకాశం ఉంది. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశం ద్వారా 40 శాతం విద్యార్థులు ఉన్నత విద్యను పొందగలుగుతున్నారు.

SCHOLARSHIP ALERT

Legrand Empowering Scholarship Program 2024-25



Description: Legrand invites applications from meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans pursuing B.Tech., B.E., B.Arch., or other undergraduate degrees in Finance or Science (such as B.Sc., B.Com., B.B.A., etc.) across India. The scholarship is meant to support meritorious students to pursue a career in Engineering, Architecture, Finance and Sciences.

Eligibility: The scholarship is open to meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans across India.

- Applicants must have secured admission in B.Tech., B.E., B.Arch., B.B.A., B.Com., or B.Sc. degrees in India.
- Applicants must have passed Class 12 in the year 2023–24.
- Girl students must have secured a minimum of 70% and above marks in Classes 10 and 12 examinations.
- Special category* students must have secured 60% marks in Classes 10 and 12 examinations. Exceptions may be considered on a case-by-case basis.
- The annual family income of the applicant from all sources must be less than INR 5,00,000.
- Preference will be given to special category* students.

Prizes & Rewards: Girl students are awarded 60% course fees up to INR 60,000 per year till the completion of course based on academic performance.

- Students in the special category* will be awarded 80% fees up to INR 1,00,000 per year till the completion of the course based on academic performance.

Last Date to Apply: 15-07-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/LFLS9

Aadhar Kaushal Scholarship Program for Youth with Disabilities

Description: An initiative of Aadhar Housing Finance Limited (AHFL) to ensure equal educational opportunities for all physically disabled students, irrespective of their geographical location, gender, or socio-economic condition.

Eligibility: Students with physical disabilities pursuing general or professional undergraduate courses across India. Pan-India students can apply. Students must have achieved a minimum of 60% marks in the preceding academic year. Applicants with a gross annual family income of up to INR 2.5- 3 lakh are eligible to apply.

Prizes & Rewards: Scholarship between INR 10,000 - INR 50,000
Last Date to Apply: 23-07-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/AKSP1

Raman Kant Munjal Scholarships

Description: The Raman Kant Munjal Scholarships 2024-25 is an initiative by the Raman Kant Munjal Foundation, supported by Hero FinCorp, that aims to help undergraduate students pursuing finance-related courses to pursue their dreams of a promising career and a better life.

Eligibility: Students enrolled in the first year of BBA, BFIA, B.Com. (H, E), BMS, IPM, B.A. (Economics), BBS, BBI, BAF, B.Sc. (Statistics), or any other finance-related degree courses are eligible. Applicants must have secured at least 80% marks in Classes 10 and 12. The annual family income of the applicants should be less than INR 4 lakh. Open for Indian nationals only.

Prizes & Rewards: Scholarship from INR 40,000 to INR 5,50,000 per year for three years
Last Date to Apply: 02-08-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/RMKSP4

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/dIPEIGGలో చదవండి.



థాయ్‌లాండ్ వెళుతున్న దేవర

జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'దేవర' మీదే ప్రస్తుతం అందరి దృష్టి ఉంది. 'ఆర్ఆర్ఆర్' తర్వాత వస్తున్న తారక్ సినిమా కావడంతో ప్రేక్షకులు, అభిమానులు ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అతిలోకసుందరి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ నటిస్తున్న తొలి తెలుగు చిత్రం ఇదే కావడం మరో ముఖ్య కారణం. దర్శకుడు కొరటాల శివ ఓ అద్భుత చిత్రంగా 'దేవర'ను తీర్చిదిద్దుతున్నారు. ఇటీవలే గోవాలో ఎన్టీఆర్, సైఫ్ అలీఖాన్ మీద ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించారు. గోవాలో భారీ వర్షం కురుస్తున్నా వెనుకడుగు వేయకుండా, రాజీ పడకుండా ఈ ఫైట్ చిత్రీకరించడం గమనార్హం. త్వరలో థాయ్‌లాండ్‌లో ఎన్టీఆర్, జాన్వీ కపూర్ మీద ఓ మెలోడియస్ సాంగ్‌ను చిత్రీకరించడానికి ప్లాన్ చేస్తున్నారు. యువసుధ ఆర్ట్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న 'దేవర' చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది.

గిలాసే ఎత్తేస్తే కులాసే



ప్రియదర్శి నభా నటేష్ జంటగా నటిస్తున్న చిత్రం 'డార్లింగ్'. 'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా హిట్‌ను అందుకున్న కె. నిరంజన్‌రెడ్డి నిర్మిస్తున్నారు. అశ్విన్ రామ్ దర్శకుడు. ఇటీవలే విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు చక్కటి ఆదరణ దక్కింది. ఇప్పుడు ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్‌ను యూనిట్ ప్రారంభించింది. 'డార్లింగ్' నుంచి తొలి గీతం 'ఖలాసే ఖలాసే మామా నా బతుకే ఖలాసే... గిలాసే ఎత్తేస్తే కులాసే'ను మంగళవారం విడుదల చేసింది. సామాన్యుడి బాధలను ఏకరువు పెడుతూ సాగే ఈ గీతానికి కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా, వివేక్ సాగర్ స్వరాలు సమకూర్చారు. హనుమాన్ సీహెచ్, రామ్ మిరియాల ఆలపించారు. బ్రహ్మానందం, విష్ణు, కృష్ణ తేజ్, అనన్య నాగళ్ల కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నరేశ్ రామదురై, ఎడిటర్: ప్రదీప్ ఇ రాఘవ్,

ఆ ప్రశ్నలకు సమాధానం కల్కి



ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న భారీ సైన్స్ ఫిక్షన్ ఎపిక్ 'కల్కి 2898 ఏడీ' ఈ నెల 27న విడుదల కానుంది. వైజయంతీ మూవీస్ సంస్థ అధినేత అశ్వనీదత్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ విజువల్ వండర్ రోజురోజుకీ అంచనాలు పెంచుతోంది. ప్రమోషన్స్‌లో భాగంగా 'ఎపిక్ జర్నీ వన్.. ది ప్రిల్యూడ్ ఆఫ్ కల్కి 2898 ఏడీ' ని మంగళవారం విడుదల చేశారు. ఈ వీడియోలో దర్శకుడు నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'కలియుగంలో ఏం జరుగుతుంది, ఏం జరగవచ్చు.. ఇలాంటి ప్రశ్నలకు 'కల్కి' క్లైమాక్స్ సమాధానం. కేవలం ఇండియాలోనే కాదు ప్రపంచంలో ఉన్న వారందరికీ సంబంధించిన కథ ఇది. నాకు చిన్నప్పటి నుంచి పౌరాణిక చిత్రాలు అంటే ఇష్టం. అలాగే హాలీవుడ్‌లో వచ్చిన 'స్టార్ వార్స్' వంటి సినిమాలు కూడా నన్ను ఆకట్టుకున్నాయి. అయితే ఇలాంటి సినిమాలను అక్కడే తీయాలా, మనం తీయలేమా అనిపించేది. మహాభారతంలో ఎన్నో గొప్ప పాత్రలు ఉన్నాయి. కృష్ణ నిర్యాణంతో కలియుగం ప్రారంభమైనప్పుడు ఏం జరుగుతుంది అనే సృజనాత్మక ఊహతో రాసుకున్న కథ ఇది. మనం చదివిన పురాణాలు, ఎపిక్స్.. అన్నింటికీ ఈ సినిమా క్లైమాక్స్‌లా ఉంటుంది. ఒక యుగంలో రావణుడు, మరో యుగంలో దుర్యోధనుడు.. ఇలా అన్నింటిలోంచి ఓ రూపం తీసుకుని దాంతో పోరాటం ఎలా ఉంటుందన్న ఐడియాతో 'కల్కి' కథ రాయడానికి ఐదేళ్లు పట్టింది. సరికొత్తగా రూపుదిద్దుకున్న ఈ సైన్స్ ఫిక్షన్ మైథాలజీని చూసి ప్రేక్షకులు ఎలా స్పందిస్తారా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నా' అన్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె, దిశా పటాని, రాజేంద్రప్రసాద్ తదితరులు ఈ చిత్రంలో నటించారు.

త్వరలోనే మీ ముందుకొస్తా



ప్రఖ్యాత గాయని, జాతీయ అవార్డు గ్రహీత అల్కా యాగ్నిక్ ఓ అరుదైన ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారు. దీని గురించి ఆమె వివరణ ఇస్తూ "కొన్నాళ్లుగా నువ్వు కనిపించడం లేదు ఎందుకని మిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులు అడుగుతున్నారు. ఈ గ్యాప్‌కు కారణం.. నేను ఓ అరుదైన వినికిడి సమస్యతో బాధపడుతున్నాను. చెవికి సోకిన ఓ వైరస్ వల్ల ఏర్పడిన ఈ వినికిడి సమస్యను చికిత్సతో నయం చేయవచ్చనే భరోసాను డాక్టర్లు ఇచ్చారు. మీరు కూడా చింతించొద్దు.. ఆందోళన చెందవద్దు. త్వరలోనే నా వినికిడి శక్తిని తిరిగి పొంది.. మీ ముందుకు ఫుల్ జోష్‌తో వస్తాను. మీరు కూడా వీలైతే పెద్ద శబ్దాల నుంచి దూరంగా ఉండండి. హెడ్‌సెట్ ధరించి ఎక్కువ సౌండ్‌తో పాటలు వినడం తగ్గించండి" అని ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు.

కొత్తదనంతో నిండిన చిత్రం



'హ్యాపీడేస్', 'కొత్త బంగారులోకం'తో లవర్ బాయ్, పక్కింటి కుర్రాడి ఇమేజ్ సొంతం చేసుకున్నారు వరుణ్ సందేశ్. తనకున్న ఆ ఇమేజ్‌కి భిన్నంగా ఆయన పూర్తి సీరియస్ రోల్‌లో నటించిన చిత్రం 'నింద'. 'కాండ్రకోట మిస్టరీ' అనేది ఉప శీర్షిక. రాజేశ్ జగన్నాథం స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మీడియాతో చిత్ర విశేషాలను పంచుకున్నారు. "నేనిప్పటివరకూ ఇటువంటి పాత్రను చేయలేదు. నిజజీవితంలో ఎంతో చలాకీగా, నవ్వుతూ కనిపించే నేను.. ఇందులో చాలా సీరియస్‌గా ఉంటాను. ఒక నటుడిగా నన్ను కొత్తగా ఆవిష్కరించిన చిత్రమిది. రొటీన్‌కు భిన్నంగా సినిమాలు చేద్దామనుకొంటున్న సమయంలో ఈ కథ విన్నా. చాలా నచ్చింది. కొన్ని యదార్థ సంఘటనల ఆధారంగా 'నింద' సినిమా కథను చాలా పకడ్బందీగా రాసుకున్నారు డైరెక్టర్ రాజేశ్ జగన్నాథం. సస్పెన్స్, క్రైమ్, థ్రిల్లర్‌లలో చాలా కథలు వచ్చాయి. కానీ వాటన్నికంటే పూర్తి భిన్నంగా ఈ సినిమా ఉంటుంది. కొత్తదనంతో నిండిన ఈ చిత్రంలో స్క్రీన్‌ప్లే చాలా గ్రిప్పింగ్‌గా ఉంటుంది. తరువాతి సన్నివేశంలో ఏం జరుగుతుందనేది ఎవరూ ఊహించలేరు" అని చెప్పారు.



టైటిల్ లోగో ఆవిష్కరించిన తేజ

దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'పోలీస్ వారి హెచ్చరిక' చిత్రం టైటిల్ లోగోని దర్శకుడు తేజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ సినిమాకైనా ప్రేక్షకుల్ని ఆకర్షించేది, వారిని థియేటర్ దగ్గరకు నడిచేలా చేసేది టైటిల్ మాత్రమే. 'పోలీస్ వారి హెచ్చరిక' శక్తిమంతమైన మాస్ టైటిల్. నిర్మాతకు విజయం చేకూరాలి' అన్నారు. 'రెండు తెలుగు రాష్ట్రాల్లో షూటింగ్ పూర్తి చేశామనీ, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందనీ నిర్మాత బెల్లి జనార్థన్, దర్శకుడు బాబ్జీ చెప్పారు. సన్నీ అఖిల్, అజయ్ ఘోష్, రవి కాలే, శుభలేఖ సుధాకర్, షియాజీ షిండే, హిమజ, జయవాహినీ, తులసి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: గజ్వేల్ వేణు, ఫొటోగ్రఫీ: నళినీకాంత్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎన్.పి. సుబ్బారాయుడు.

ప్రియురాలిని పెళ్లాడుతున్న సిద్ధార్థ్ మాల్యా



వ్యాపారవేత్త విజయ్ మాల్యా తనయుడు, నటుడు సిద్ధార్థ్ మాల్యా పెళ్లి పీటలు ఎక్కనున్నారు. తన ప్రియురాలు జాస్మిన్‌ను సిద్ధార్థ్ లండన్‌లో బంధుమిత్రుల సమక్షంలో పెళ్లాడనున్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఖాతాలో వారిద్దరూ కలసి తెల్లకోటు, తెల్ల గౌను వేసుకుని పెళ్లి దుస్తుల్లో ముస్తాబైన ఓ ఫొటోను పోస్ట్ చేసి "పెళ్లికి సమయం ఆసన్నమైంది. వేడుకలు మొదలయ్యాయి" అని ఆయన పేర్కొన్నారు. జాస్మిన్‌కు గతేడాది నవంబరులో తన ప్రేమను వ్యక్తపరిచిన సందర్భాన్ని.. ఇద్దరూ కలసి నిశ్చితార్థపు ఉంగరాన్ని ధరించిన ఫొటోలను సిద్ధార్థ్ మాల్యా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. దీంతో వీరిద్దరి ప్రేమాయణం గురించి అందరికీ తెలిసింది.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/x2HehXX లో చదవండి.

గంజాయి విక్రేతలపై ఉక్కుపాదం

- జిల్లాలో నాలుగు వందల మందిపై రౌడీషీట్లు
- పల్నాడు ఎస్పీ మల్లికా గార్గ్


ఎస్పీ మల్లికా గార్గ్

చిలకలూరిపేట, జూన్ 18: పల్నాడు జిల్లాలో గంజాయి విక్రేతలపై, గంజాయిని రవాణా చేసే వారిపై ఉక్కు పాదం మోపుతామని పల్నాడు జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్ మంగళవారం అన్నారు. చిలకలూరిపేట అర్బన్, రూరల్ సర్కిళ్ళ పరిధిలో కేసులను ఆమె స్థానిక అర్బన్ పోలీసు స్టేషన్‌లో సమీక్షించారు. ఎన్నికల సందర్భంగా జరిగిన సంఘటనలపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ గత నాలుగైదు సంవత్సరాల్లో జరిగిన వివిధ సంఘటనల్లో పాల్గొని గొడవలకు దిగిన వారిని కూడా పిలిచి అవసరాన్ని బట్టి వారిపై కూడా రౌడీషీట్లు తెరుస్తామని, బైండోవర్ కేసులు పెడతామని చెప్పారు. గత అనేక సంవత్సరాల్లో ఎటువంటి గొడవలకు పోకుండా సత్ప్రవర్తనతో ఉన్న వారిని పరిశీలించి వారిపై రౌడీషీట్లు ఎత్తి వేస్తామని కూడా తెలిపారు. గంజాయి రవాణాను అరికట్టడానికి ఆకస్మిక తనిఖీలతో పాటు వాహనాల తనిఖీలను ముమ్మరం చేస్తామన్నారు. చిలకలూరిపేట నియోజక వర్గంలో కూడా ఎన్నికల సందర్భంగా గొడవలకు దిగిన వారిపై రౌడీషీట్లు తెరుస్తామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆమె తెలిపారు. సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ సీఐలు బీ సురేష్ బాబు, యూ శోభన్ బాబు, అర్బన్ సీఐ పి.సురేష్, రూరల్ సి.శ్రీనివాసరెడ్డి, నాలుగు పోలీసు స్టేషన్‌ల ఎస్ఐలు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు


బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల రూరల్, జూన్ 18: బాపట్ల మండలం వెదుళ్ళపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితులకు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.5వేలు జరిమాన కోర్టు విధించిందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్టూవర్టుపురానికి చెందిన మానుపాటి దుర్గాప్రసాద్, మానుపాటి వెంకటేశ్వర్లుపై ఖమ్మం జిల్లా యర్రపాలెం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదయ్యాయి. వారి కోసం హెడ్‌కానిస్టేబుల్ పడల వెంకటేశ్వర్లు, హోంగార్డు విజయ్‌కుమార్ రాగా నిందితులు వారిపై కత్తులతో దాడి చేశారు. చికిత్స నిమిత్తం బాపట్ల ప్రభుత్వ వైద్యశాలలో చేర్చారు. హెడ్‌కానిస్టేబుల్ పడల వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు వెదుళ్లపల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్ఐ ఎస్.వెంకట్రావు నిందితులు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ సి.హెచ్.సురేష్ న్యాయస్థానంలో నిందితులపై అభియోగపత్రం దాఖలు చేశారు. బాపట్ల ప్రిన్సిపల్ సెషన్స్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి జి.వాణికుమారి మంగళవారం మానుపాటి దుర్గా ప్రసాద్, మానుపాటి వెంకటేశ్వర్లులకు జైలుశిక్ష, జరిమాన విధిస్తున్నట్లు తీర్పు చెప్పారు.

నేనున్నాననే భరోసా

- ప్రజా దర్బార్‌లో ప్రజల కష్టాలకు స్వాంతన
- నిత్యం వందలాదిగా తరలివస్తున్న ప్రజలు
- సమస్యలను సావధానంగా వింటున్న లోకేశ్
- సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని హామీ


లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మీసేవ నిర్వాహకులు

మంగళగిరి సిటీ, జూన్ 18: గత ఐదేళ్లుగా అనేక సమస్యలు, ఇబ్బందులతో బాధపడుతున్న మంగళగిరి ప్రజలకు నేనున్నాననే భరోసా కల్పిస్తున్నారు రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖా మంత్రి నారా లోకేశ్. ఉండవల్లి నివాసంలో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు ప్రజల నుంచి అర్జీలు వెల్లువెత్తుతున్నాయి. తమ దృష్టికి వచ్చిన సమస్యలను ఆయా శాఖల అధికారులకు పంపి నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నివసించే ఉండవల్లిలోని నివాసంలోనే మంత్రి లోకేశ్ కూడా ఉంటున్నారు. సాధారణంగా సీఎం నివాసం వద్ద కట్టుదిట్టమైన పోలీసు భద్రత ఉంటుంది. అయితే అందుకు భిన్నంగా చంద్రబాబు నివాసం వద్ద ప్రజలకు ఎలాంటి ఆంక్షలు లేవు. నిత్యం వందలాది మంది ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు నేరుగా ఉండవల్లి నివాసానికి విచ్చేస్తున్నారు. మంత్రి లోకేశ్ రోజు ప్రజలను కలుసుకుని వారి కష్టాలను సావధానంగా వింటున్నారు. ప్రజాదర్బార్ ద్వారా కష్టాల్లో వున్న ప్రజలకు స్వాంతన లభిస్తోంది. మంగళవారం కూడా పెద్దసంఖ్యలో ప్రజలు మంత్రి లోకేశ్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. మంగళగిరికి చెందిన గూడూరు వెంకట సుబ్బమ్మ తనకు పింఛన్ ఇప్పించాలని, తాడేపల్లి సుందరయ్య నగర్‌కు చెందిన బి.దుర్గాప్రసాద్ తమకు ఇంటిపట్టా ఇప్పించి, తాగునీటి సమస్యను పరిష్కరించాలని, మంగళగిరికి చెందిన చిల్లపల్లి వీరమ్మ తల్లి లేని తన మనవడి చదువు కోసం ఆర్థిక సాయం అందించాలని, టి.జయమణి తనకు రద్దు చేసిన ఒంటరి మహిళ పింఛన్ పునరుద్ధరించాలని, గంజి లత తనకు ఇంటి స్థలం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మీసేవ వ్యవస్థపై ఆధారపడిన నిర్వాహకులు తమకు న్యాయం చేయాలని కోరారు. విజయవాడలో నిరసన సందర్భంగా సీపీఎస్ ఉద్యోగులపై నమోదు చేసిన 1,600 కేసులను రద్దు చేయాలని ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు లోకేశ్ కు వినతిపత్రం సమర్పించారు. ఆయుష్మాన్ హెల్త్ క్లినిక్‌లలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయడం తోపాటు 23 శాతం వేతన సవరణ, 9 నెలల పెండింగ్ జీతం వంటి సమస్యలను పరిష్కరించాలని ఏసీఎంసీఏ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఆయా సమస్యలను విన్న మంత్రి లోకేశ్ వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

అగ్రిగోల్డ్ స్కామ్‌పై విచారణ జరిపిస్తాం

- మంత్రి అనగాని


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జూన్ 18: అగ్రిగోల్డ్ స్థలాల స్కామ్‌పై విచారణ జరిపిస్తాం.. మాజీమంత్రి జోగి రమేష్ అతని కుమారుడు, బంధువులు భూహక్కు పత్రాలు మార్చి అగ్రిగోల్డ్ ఆస్తులను కాజేశారు.. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌కు విశాలమైన భవనాలు అంటే పిచ్చి అని వందలాది కోట్లు ప్రజాధనంను దుర్వినియోగం అయ్యేలా రుషికొండపై విశాలమైన భవనాలు నిర్మించారన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం 5 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందన్నారు. కేంద్ర సహకారంతో పోలవరంను సత్వరమే పూర్తి చేస్తామని, రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ఘనుడు జగన్ అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఒక్కటేనని దాని అభివృద్ధి దిశగా ముందుకు వెళ్ళతామన్నారు. చంద్రబాబునాయుడు విజన్, పవన్‌కళ్యాణ్ ఆలోచన, మోదీ అండతో రాష్ట్రాన్ని పూర్తిగా అభివృద్ధి చేస్తామన్నారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ అండతో వెనకబడిన తీరప్రాంతమైన రేపల్లెను అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో కక్ష సాధింపులు ఉండవని తప్పు చేసిన నాయకులు, అధికారులు ఎవరైనా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మత్తి భాస్కరరావు, బీజేపీ నాయకులు ఇంకొల్లు మాణిక్యారావు, టీడీపీ నాయకులు బోడపాటి శ్రీనివాసరావు, పంతాని మురళీధరరావు, కొలసాని రాము, దేవగిరి రవి, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై గంపెడాశలు

- విలీనంతో నిర్వీర్యం చేశారంటూ ఆర్టీసీ ఉద్యోగుల ఆవేదన
- నోరెత్తితే సస్పెన్షన్‌లు, అరకొర వసతులు


గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్

గుంటూరు, జూన్ 18: చాలీచాలని వేతనాలు, వైద్య సదుపాయాల కరవు, నోరెత్తితే సస్పెన్షన్‌లు ఇదీ ఆర్టీసీ ఉద్యోగులు దీనావస్థ. ప్రభుత్వంలో విలీనం పేరుతో వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీనే నిర్వీర్యం చేసిందని ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఏర్పడిన ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వంపై ఆర్టీసీ ఉద్యోగులు కోటి ఆశలు పెట్టుకున్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం 43 శాతం ఫిట్‌మెంట్‌తో ఆర్టీసీ ఉద్యోగులకు జీతాలు పెంచితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 23 శాతానికి జీతాలు తగ్గించారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు రీజియన్‌ను ప్రస్తుతం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల రీజియన్‌గా ఏర్పాటు చేశారు. ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క కొత్త బస్సు కూడా కొన్న దాఖలాలు లేవని ఆవేదన చెందుతున్నారు. ఆర్టీసీ విలీనంతో ప్రభుత్వ ఉద్యోగులు పొందే ప్రయోజనాలు పొందుతామని భావించిన ఆర్టీసీ ఉద్యోగులు అదనపు ప్రయోజనాలు రాకపోగా ఉన్న ప్రయోజనాలను తొలగించారని వాపోతున్నారు. గతంలో అపరిమితంగా ఆర్టీసీ ఉద్యోగికి వైద్య సదుపాయాలు పొందితే ప్రస్తుతం కనీసం వైద్యసేవలు అందే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు అందిస్తే వైసీపీ ప్రభుత్వంలో ఎప్పుడు జీతాలు వస్తాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. ఇక ఇదేమని ఏదైనా ప్రశ్నిస్తే చీటికి మాటికి సస్పెన్షన్‌లతో ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేశారని వాపోయారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంపై ఆర్టీసీ ఉద్యోగులు గంపెడాశలు పెట్టుకున్నారు. ఉద్యోగులకు న్యాయమైన జీతాలు చెల్లించటంతో పాటు వైద్య సదుపాయాలు, అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పైగా డొక్కు బస్సుల స్థానంలో కొత్త బస్సులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

1/2019 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలి

- మండవ రాజేష్, కార్మిక పరిషత్ గుంటూరు రీజనల్ కార్యదర్శి



ఆర్టీసీ కార్మికులపై అడ్డగోలు సస్పెన్షన్‌లను ఆక్షేపిస్తూ గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ ఎండీగా ఉన్న సురేంద్రబాబు ప్రత్యేకంగా 1/2019 సర్క్యులర్ జారీ చేశారు. దాంతో రాష్ట్రంలో ఎక్కడైనా ఏ డిపోలోనైనా ఉద్యోగుల చర్యలకు అనుగుణంగా ఒకే విధమైన పనిష్మెంట్‌లు ఉండేలా ఆదేశాలు జారీ చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక వారి పెత్తనం సాగటం లేదని మళ్ళీ అడ్డగోలు సస్పెన్షన్‌లు చేస్తున్నారన్నారు. పాత సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలి. అలాగే ప్రస్తుతమున్న ఆర్టీసీ సర్వీసుల్లో 80 శాతం పైగా డొక్కు బస్సులే. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఒక్క కొత్త బస్సు కూడా కొనలేదు. ఆ స్థానంలో కొత్త బస్సులు ఎంతైన అవసరమే.

సేఫ్టీ డ్రైవ్‌లు కొనసాగించాలి

- దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలిస్తున్న రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

గుంటూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో సేఫ్టీ డ్రైవ్‌లు కొనసాగించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ గుంటూరు రైల్వే అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీఆర్ఎం ఎం రామకృష్ణతో సమీక్ష నిర్వహించారు. రాబోయే వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. వంతెనలు, చెరువులు, కాలువలు, వాగుల వద్ద జాయింట్ ఇన్‌స్పెక్షన్‌లు నిర్వహించి భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. లోకో పైలట్‌లు, షంటర్స్ ట్రాక్ మెయిన్‌టెయినర్లు, గార్డులు, ఇతర సిబ్బందికి ఎప్పటికప్పుడు భద్రతపై కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. సరుకు రవాణకు ప్రాధాన్యం ఇచ్చి ఆదాయం పెంపుపై దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు.

ఐటీఐ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య), జూన్ 18: జిల్లాలోని ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ డీఎల్ఐటీసీ సహాయ సంచాలకులు సాయివరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్ 40, ఫిట్టర్ 40, మెకానిక్‌మోటర్ 24, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ 24 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ప్రభుత్వ ఐటీఐ కళాశాల(కలెక్టరేట్ ఎదుట, 89780 25794, 83339 73929) సంప్రదించాలని సూచించారు.

బాలింత, నవజాత శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ

మాచర్లటౌన్, జూన్ 18: వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత, నవజాత శిశువు మృతిచెందిన ఘటన పల్నాడు జిల్లా మాచర్ల మండలం విజయపురిసౌత్ సామాజిక ఆరోగ్యం కేంద్రంలో మంగళవారం జరిగింది. విజయపురి సౌత్‌కు చెందిన కారే పావని (21) పురిటి నొప్పులు రావడంతో సోమవారం రాత్రి వైద్యశాలలో చేరింది. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో మగ శిశువుకు జన్మనిచ్చింది. అయితే గంట వ్యవధిలోనే శిశువు మృత్యువాత పడగా తల్లి ఆరోగ్య పరిస్థితి కూడా విషమంగా ఉండడంతో అక్కడి వైద్యులు 108 అంబులెన్స్‌లో మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే మార్గమధ్యంలోనే బాలింత పావని మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యుల నిర్లక్ష్యం వలనే తల్లి, బిడ్డ మృతి చెందినట్లు బంధువులు ఆరోపిస్తూ విజయపురిసౌత్ సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న మాచర్ల రూరల్ సీఐ కె సురేష్, విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభిరామయ్యలు సంఘటనా ప్రదేశానికి చేరుకొని బాధిత కుటుంబసభ్యులతో చర్చించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సురేష్ తెలిపారు.

టమాటాల కొనుగోళ్లకు రూ.5 లక్షల రివ్వాల్వింగ్ ఫండ్

గుంటూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): టమాటాలను కొనుగోలు చేసి రైతుబజార్లలో అందుబాటులో ఉంచేందుకు ప్రతీ జిల్లాకు రూ. 5 లక్షల రివాల్వింగ్ ఫండ్ విడుదల చేశామని మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొరుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం టమాట సాగు లేకపోవడంతో చిత్తూరు జిల్లాలో మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. దీని వలనే ధర పెరిగిందని చెప్పారు. ఇప్పటికే 30 టన్నులు కొనుగోలు చేసి అదే ధరకు రైతుబజార్లలో అందుబాటులో ఉంచామన్నారు. సగటున కేజీ రూ. 54కు ప్రజలకు విక్రయిస్తున్నామన్నారు. ధర తగ్గేంత వరకు టమాటలు తాము చిత్తూరు నుంచి తెప్పించి రైతుబజార్లలో ఉంచుతామని చెప్పారు.

ఏఎన్‌యూ డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాలు విడుదల

పెదకాకాని, జూన్ 18: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వీసీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ మంగళవారం విడుదల చేశారు. ఈ పరీక్షలకు 11,103 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 8,899మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. అదనపు పరీక్షల నియంత్రణాధికారి రెడ్డి ప్రకాష్‌రావు మాట్లాడుతూ రీ వెరిఫికేషన్‌కు రూ.1700, రీ వాల్యువేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.1,240 చెల్లించి జూలై 2వ తేదీలోగా ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు అందజేయాలని సూచించారు. ఫలితాలు వర్శిటీ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చునని తెలిపారు.

21న కేంద్ర మంత్రి పెమ్మసాని ఆత్మీయ సమావేశం

గుంటూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తన విజయానికి దోహదం చేసి, భారీ మెజార్టీతో విజయం అందించిన ఏడు నియోజకవర్గాల్లోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ధన్యవాదాలు తెలిపారు. గుంటూరు పార్లమెంటు స్థానం పరిధిలోని ఎన్‌డీఏ మిత్రపక్ష నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఈనెల 21న గుంటూరులో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు టోల్ ప్లాజా నుంచి జాతీయ రహదారి మీదుగా గుంటూరు ఆటోనగర్, ఆర్టీసీ బస్టాండ్, జిన్నాటవర్ సెంటర్, ఏసీ కళాశాల, హిందూ కళాశాల, శంకర్‌విలాస్ ఫ్లైఓవర్, అమరావతి రోడ్డులోని చిల్లీస్ రెస్టారెంట్ మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్‌లో గల శ్రీ కన్వెన్షన్ వరకు జరుగనుంది. సాయంత్రం 6 గంటలకు ఇన్నర్‌రింగ్ రోడ్డులోని శ్రీ కన్వెన్షన్ హాల్‌లో ఆత్మీయ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఏడు నియోజకవర్గాల నుంచి తన విజయానికి సహకరించిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను పెమ్మసాని స్వయంగా ఆహ్వానిస్తున్నారు. కార్యక్రమం అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి విందు కార్యక్రమంలో పాల్గొంటారు.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూకల దాడి


దాడిలో గాయపడిన గౌస్

నరసరావుపేట రూరల్, జూన్ 18: మండలంలోని కేశానుపల్లి పంచాయతీ పరిధిలోగల ఎస్ఆర్‌కేటీ కాలనీలో టీడీపీ వర్గీయులపై వైసీపీ మూకలు దాడి చేసిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. నరసరావుపేట రూరల్ ఎస్ఐ రోశయ్య తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన వైసీపీ వర్గీయురాలు జాన్‌బీ, ఆమె కుమారుడు రబ్బాని సోమవారం రాత్రి టీడీపీకి చెందిన గౌస్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. గాయపడిన గౌస్ నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం గౌస్ పరిస్థితి విషమంగానే ఉన్నట్లు సమాచారం. ఈ సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ రోశయ్య తెలిపారు.

కాసు మహేష్‌రెడ్డి.. రాజకీయ సన్యాసం ఎప్పుడు?

- ఎమ్మెల్యే యరపతినేని


యరపతినేని శ్రీనివాసరావు

దాచేపల్లి, జూన్ 18: దివంగత మాజీ ముఖ్యమంత్రి కుటుంబం నుంచి వచ్చిన కాసు మహేష్‌రెడ్డి మాటమీద నిలబడతాడనే నమ్మకం తనకుందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం దాచేపల్లి ఆర్‌అండ్‌బీ బంగ్లాలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి కార్యకర్తలు అహర్నిశలు శ్రమించి నరరూప రాక్షసుడి పాలనను అంతమొందించారని తెలిపారు. గత ఐదేళ్లలో 11 మంది టీడీపీ కార్యకర్తలను హత్యచేశారు. 8 మంది చిన్నారులను బలితీసుకున్నారు. 70 మందికి పైగా వైసీపీ దాడులలో గాయాలపాలయ్యారు. వందల సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు గ్రామాలు వదిలిపెట్టి వెళ్లారు. గంజాయి, రేషన్, మద్యం, ఇసుక మాఫియాతో అక్రమ వ్యాపారాలు చేసి ప్రజలను దోచుకున్నారు. ఇప్పుడు ప్రజలు వారికి బుద్ధి చెప్పడం జరిగింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా కూటమికి 164 సీట్లు ఇచ్చి తమ మద్దతును తెలియజేశారు. రానున్న ఐదేళ్లలో గురజాల నియోజకవర్గంలో 10వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. అందరినీ కలుపుకొని అభివృద్ధిని సాధిస్తామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ల సహాయ సహకారాలతో గురజాల నియోజకవర్గానికి అధిక నిధులు తెప్పించి అభివృద్ధిని సాధిస్తామన్నారు. అరాచకాలకు స్వస్తిపలికి అభివృద్ధికి శ్రీకారం చుడతామన్నారు. గత వైసీపీ పాలనలో నియోజకవర్గంలో 3 వేల ఎకరాలకు పత్రాలు పుట్టించి రికార్డులు మాయం చేశారన్నారు. అధికారుల అవినీతిని బయటపెడతామన్నారు. మాజీ ఎంఎల్‌సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ గత ఐదేళ్లుగా బీసీ ఎస్సీ ఎస్టీలకు అన్యాయం చేసిన వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. అరాచకాలకు, ఆగడాలకు, అహంకార దోరణికి వైసీపీ పక్కా నిదర్శనంగా మారిందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా జరిగిన అన్యాయాలు, అక్రమాలను చూసి భరించలేని ప్రజలు కసిగా ఓట్లువేసి టీడీపీ ప్రభుత్వానికి తమ మద్దతు తెలియజేశారన్నారు. చంద్రబాబు నాయకత్వంలో యరపతినేని ఆధ్వర్యంలో గురజాల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామన్నారు.

20న ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

గుంటూరు(విద్య), జూన్ 18: ఈనెల 20న జిల్లా ఉపాధి కార్యాలయం (గుంటూరు, గుజ్జనగుండ్ల)లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి కె.రమాదేవి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్మూల్స్, కాలేజీలు, గోదావరి ఆంధ్రాకో ఆపరేటివ్ సొసైటీ, మిట్టపల్లి స్పిన్నర్స్, స్వాతి లక్ష్మీగార్మెంట్స్, సెలక్ట్‌మోబైల్స్ తదితర సంస్థలు జాబ్‌మేళాలో పాల్గొంటాయని తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, ఎంఎస్సీ పూర్తిచేసి 18 నుంచి 35 సంవత్సరాల వయసు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. బయోడుటా, అర్హత సర్టిఫికెట్ల, ఆధార్, పాస్‌పోర్టుసైజ్ ఫొటోలతో జిల్లా ఉపాధి కార్యాలయం, గుజ్జనగుండ్లలోని జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

41,876 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 45,291 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 41,876 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 14,003 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	17000
నెంబరు 5	11000	14500
273	9500	15500
341	9000	17500
సూపర్ 10	15000	15000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	19000
బ్యాడిగి	9000	17000
దేవనూరుడీలక్స్	8500	13000
తెల్లకాయలు	4500	10500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	8500	16500
నెంబరు.5	13000	14500
273	15500	15500
341	9500	13000
4884	14000	17000
సూపర్ 10	13200	13200
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9000	19500
బ్యాడిగి	11500	16000
దేవనూరుడీలక్స్	15000	15000
తెల్లకాయలు	5000	10700

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.85
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	150, 159,170
చికెన్ విత్ స్కిన్	290.00
చికెన్ స్కిన్ లెస్	300.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



గురజాల విజయోత్సవ ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న యరపతినేని

అంబరాన్నంటేలా స్వాగత సంబరం

- గురజాల గడ్డపై కాలుమోపిన యరపతినేని
- వేలాదిగా తరలివచ్చిన పసుపు సైన్యం
- అడుగడుగునా అపూర్వ స్వాగతం
- అభిమాన నేతను గుండెల్లో పెట్టుకున్న ప్రజలు

గురజాలటౌన్, జూన్ 18: సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయం సాధించి గురజాల గడ్డపై మంగళవారం కాలుమోపిన యరపతినేనికి ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు.. గజమాలలు, హారతులు పట్టారు.. గంటల తరబడి ర్యాలీలో ఉన్నప్పటికీ యరపతినేని సైతం అలుపెరగక అడుగడుగునా అభివాదం చేసుకుంటూ కేడర్‌లోనూ ఉత్సాహం నింపారు. తమ అభిమాన నేత యరపతినేని శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా భారీ మెజార్టీ సాధించి గురజాలకు వస్తున్నారని తెలియడంతో ప్రతి పల్లె పట్టణం వైపు కదిలింది. మండలంలోని ప్రతి గ్రామం నుంచి వందలాదిగా ప్రజలు తమ వాహనాల్లో పట్టణానికి కదిలివచ్చారు.

పార్టీ కార్యాలయం నుంచి మొదలై...

మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తితో కలిసి ఎమ్మెల్యే యరపతినేని యరపతినేని శ్రీనివాసరావు ముందుగా పట్టణంలోని పార్టీ కార్యాలయంకు చేరుకున్నారు. అక్కడినుంచి ర్యాలీగా కారంపూడి రోడ్డులోని సాయిబాబా ఆలయంకు చేరుకున్నారు. అక్కడ పూజలు అనంతరం గ్రామ దేవతైన పాతపాటేశ్వరి అమ్మవారి ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. కొట్లబజారు మీదుగా లక్ష్మీటాకీస్ సెంటర్ నుంచి మాచర్ల-గుంటూరు ప్రధానరహదారిపైకి చేరుకున్నారు. పట్టణమంతా పసుపుమయంగా మారింది.

రెండు కిలోమీటర్లు.. నాలుగు గంటలు..

ఎమ్మెల్యే యరపతినేని విజయోత్సవ ర్యాలీ ప్రభజనంలా మారింది. నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుపొంది గురజాల పట్టణంలో అడుగుపెట్టడంతో కూటమి నేతలు, ప్రజలు భారీగా తరలివచ్చారు. రెండు కి.మీ.ల ర్యాలీ నాలుగు గంటలదాకా పట్టింది. కూటమి నేతలు, ప్రజలు రాకతో పట్టణం కిక్కిరిసిపోయింది.

పసుపుమయంగా మారిన దాచేపల్లి

దాచేపల్లి: గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యేగా 4వసారి గెలిచి తొలిసారి గా దాచేపల్లికి వచ్చిన ఎమ్మెల్యే యరపతినేనికి మండల ప్రజలు గజమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. కనక తప్పెట్లతో గుమ్మడికాయలతో దిష్టితీసి హారతులతో ఘనస్వాగతం పలికారు. మంగళవారం దాచేపల్లిలోని తంగెడ రోడ్డుకు చేరుకున్న యరపతినేని ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వాహనంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాజీ ఎంఎల్‌సీ జంగా కృష్ణమూర్తిలు టాప్ లెస్ వాహనంలో ర్యాలీలో పాల్గొన్నారు. దాచేపల్లి పట్టణ, మారుమూల గ్రామాల నుండి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో దాచేపల్లికి చేరుకోవడంతో ప్రధాన వీధులన్నీ పసుపుమయంగా మారాయి. దాచేపల్లి గ్రామదేవత శ్రీఅంకమ్మతల్లిని దర్శించుకొని పట్టువస్త్రాలు అందజేశారు. అనంతరం దాచేపల్లి ఆర్‌అండ్‌బి బంగ్లాకు చేరుకున్నారు.

2 గంటలపాటు కొనసాగిన ర్యాలీ

దాచేపల్లి అమరావతి హోటల్ వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆర్ అండ్‌బీ బంగ్లా వరకు సుమారు 2 గంటల పాటు కొనసాగింది. బంగ్లాకు చేరుకున్న యరపతినేని చెట్లనీడలోనే వుండి కార్యకర్తలతో మమేకమయ్యారు. దాచేపల్లి మండల గాయత్రి బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు, మాజీ ఎంఎల్‌సీ జంగా కృష్ణమూర్తికి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆయా కార్యక్రమాలలో జడ్‌పిటిసి జంగా వెంకట కోటయ్య, యరపతినేని సాయినిఖిల్, డాక్టర్ కర్నాటి వరలక్ష్మి, తంగెళ్ల శ్రీనివాసరావు, బెల్లంకొండ భద్రి, నర్రా పుల్లయ్య, పగడాల భాస్కరరావు, అక్కినపల్లి బాలయ్య, వేముల వినోద్‌రెడ్డి, వేముల తిరుమల కుమార్, నెల్లూరి రామకోటయ్య, చింతపల్లి హసన్ అహ్మద్, పురం శెట్టి పరంజ్యోతి, మామిడి చంద్రశేఖరరావు, సొసైటీ నారాయణ, అం బటి శేషగిరిరావు, మాజీ సర్పంచ్ వలి, నాయబ్ అబ్దుల్లా, కూరాకుల నాగేశ్వరరావు, బొమ్మిరెడ్డి నారాయ ణ, గుదె సైదయ్య తదితర నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దాచేపల్లిలో శ్రీ అంకమ్మతల్లికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని



దాచేపల్లిలో ప్రజలకు అభివాదం చేస్తున్న యరపతినేని శ్రీనివాసరావు, జంగా కృష్ణమూర్తి

పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల: గురజాల శాసనసభ్యునిగా ఎన్నికైన యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం పట్టణంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత నాగులగుడి, భోళాలింగేశ్వరస్వామి దేవాలయం, అభయాంజనేయస్వామి దేవాలయం, అయ్యప్పస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆయా దేవాలయాల కమిటీ సభ్యులు యరపతినేనికి స్వాగతం పలికారు. కార్యక్రమాలలో యరపతినేని నిఖిల్, పాండురంగ శ్రీను, కనిగిరి శ్రీను, దియ్యా రామకృష్ణ, కొమ్మినేని రామచంద్రరావు, వనజా సాంబశివరావు, ఆలేటి మల్లిఖార్జునరావు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, తురకా వీరస్వామి, చందోలు రామకృష్ణారావు, గుదె నాగసతీష్, వున్నం ఆంజనేయులు, సయ్యద్ అమీర్‌అలి, కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశింసైదా, ఎల్‌వీఆర్, బొల్లా శ్రీను, వున్నం సురేష్, ముప్పాళ్ల సాంబయ్య, చింతలపూడి రామ్మూర్తి, గండికోట వెంకటేశ్వర్లు, మేకల రాంబాబు, బండ్ల వెంకటేష్, మునగా వెంకట్, నర్రా సాంబశివరావు, చల్లగుండ్ల శ్రీను, పాటిబండ్ల శ్రీహరి, వడ్డవల్లి సాంబశివరావు, గుండా శ్రీనివాసరావు, అంచూరి శ్రీనివాసరెడ్డి, నూతి నారాయణ, జుజ్జూరి మురళీ, వున్నం వెంకటరావుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమాలపై ఫిర్యాదులొస్తున్నాయ్!

విచారణ జరుపుతాం : జేసీ శ్యాంప్రసాద్



పిడుగురాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్న జేసీ శ్యాంప్రసాద్

పిడుగురాళ్ల, జూన్ 18: పల్నాడు ప్రాంతంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై విచారణ జరుపుతామని జేసీ శ్యాంప్రసాద్ తెలిపారు. మంగళవారం పిడుగురాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. కౌలురైతు గుర్తింపు కార్డుల ప్రక్రియతో పాటు గత ఐదేళ్లుగా గురజాల నియోజకవర్గ పరిధిలో అన్ని మండలాల్లో అడ్డగోలుగా, భూముల కేటాయింపుతో పాటు ప్రభుత్వ భూముల ఆక్రమణ వివరాలపై పూర్తిస్థాయి విచారణ జరుపుతామన్నారు. గతంలో జరిగిన భూ అక్రమణలపై కొందరు తహసీల్దార్లు, వీఆర్‌ఓల పనితీరుపై కూడా విచారణ జరుపుతామని జేసీ చెప్పారు. నిషేధిత భూముల జాబితా(22ఎ)లో వున్నవాటిని సైతం రెవెన్యూ రికార్డులు మార్చేసి కొందరు వైసీపీ నేతలు చెప్పినట్లు అనుయాయులకు రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదుపై కూడా వివరాలు అడిగినట్లు తెలిసింది. గత వారం ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన కథనాలపై కూడా జేసీ స్పందించి రెవెన్యూ రికార్డులను పరిశీలించి కొన్ని వివరాలు అడిగినట్లు సమాచారం.

ప్రముఖ వ్యాపారవేత్త కనిగిరి సాంబయ్య మృతి

దాచేపల్లి, జూన్ 18: ప్రముఖ వ్యాపారవేత్త కనిగిరి సాంబయ్య (82) మంగళవారం మృతి చెందారు. దాచేపల్లి పట్టణంలో పలురకాల వ్యాపారాలు చేపట్టి ఆర్యవైశ్య నాయకుడిగా ప్రజలలో మన్ననలు పొందారు. సాంబయ్య మృతిపట్ల వివిధ పార్టీల నాయకులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆర్యవైశ్యులు తమ సంతాపాన్ని తెలిపారు. దాచేపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సాంబయ్య తనవంతు సహకరించారు.

యరపతినేనిని కలిసిన ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్

పిడుగురాళ్ల, జూన్ 18: ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును మంగళవారం పిడుగురాళ్లలోని ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రైవేటు పాఠశాలల సమస్యల గురించి యరపతినేనికి తెలియజేశారు. దీనిపై యరపతినేని స్పందిస్తూ ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారంలో తాను ఎల్లప్పుడూ అండగా వుంటానని, ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తనవద్దకు రావచ్చునన్నారు. ఈ సమావేశంలో పీజేఎస్ ధన్, వికాస్ వెంకట్రామయ్య, జి శ్రీనివాసరెడ్డి, తాళ్లపల్లి బాలగంగాధరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, విజ్ఞాన్ సాంబశివరావు, ఆత్మకూరి రామకృష్ణ, మస్తాన్, గంగాధర్, లక్ష్మీపతి, సతీష్, తదితరులున్నారు.

పిడుగురాళ్లకు చేరిన పెనుగొండ పాదయాత్ర



పిడుగురాళ్లలో పెనుగొండ పాదయాత్ర..

పిడుగురాళ్ల, కారంపూడి, జూన్ 18: కారంపూడికి చెందిన టీడీపీ ఆర్యవైశ్య నేత కర్నాటి గోపాలకృష్ణ పెనుగొండ శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం వరకు పాదయాత్ర చేపట్టారు. కారంపూడి నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర మంగళవారంకు పిడుగురాళ్లకు చేరుకుంది. కూటమి నేతలు ఈ పాదయాత్రకు ఘన స్వాగతం పలికారు. అత్యధిక మెజార్టీతో కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేయడంతో గోపాలకృష్ణ పాదయాత్ర చేపట్టారు. పిడుగురాళ్ల ఆర్యవైశ్య ప్రముఖులు కట్టమూరి శంకరరావు, పాండురంగ శ్రీను, వనజా సాంబశివరావు, జూలకంటి సుబ్రహ్మణ్యం, ఎస్‌ఆర్‌ఎంటి సుబ్బారావు, కరాలపాటి సుబ్బారావుతో పాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు స్థానిక అమ్మవారి దేవాలయంలో పూజా కార్యక్రమాల అనంతరం పిడుగురాళ్ల పట్టణం దాటేవరకు గోపాలకృష్ణమూర్తికి సంఘీభావంగా పాదయాత్రలో పాల్గొన్నారు.

ఎన్నికల ఫలితాలపై జగన్ వ్యాఖ్యలు బాధాకరం

సత్తెనపల్లి, జూన్ 18: రాజ్యాంగ వ్యవస్థల ద్వారా రాష్ట్రంలో జరిగిన ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈవీఎంల గురించి అనుమానాలు వ్యక్తంచేయటం, మాట్లాడటం బాధాకరమని టీడీపీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి దివ్వెల శ్రీనివాసరావు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. జగన్‌కు మతిభ్రమించిందన్నారు. ఓటమిని తట్టుకోలేక ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారన్నారు. రాజ్యాంగవ్యవస్థను తప్పుబట్టడం సరికాదన్నారు.

21న ఆలయ భూములకు కౌలు బహిరంగ వేలం

నకరికల్లు, జూన్ 18: ఈనెల 21వ తేదీ నకరికల్లులోని శ్రీలక్ష్మీనరసింహాస్వామి దేవాలయానికి సంబంధించిన భూములను కౌలుకు ఇచ్చేందుకు బహిరంగవేలం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో వై వెంకయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. సర్వే నెంబరు 49లో 6.30 ఎకరాలకు సర్వే నెంబరు 125లో ఐదు ఎకరాలకు కౌలువేలంపాటను నరసరావుపేటలోని శ్రీ అంకమ్మ అమ్మవారి దేవస్థాన ఆవరణలో నిర్వహించనున్నట్టు తెలిపారు. వరుసగా ఈ సంవత్సరం నుంచి మూడు సంవత్సరాల వరకు కౌలుకు ఈ వేలం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గల రైతులు వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి

నకరికల్లు, జూన్ 18: ప్రభుత్వం విద్యార్థులకు అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని చేజర్ల జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం షేక్ పాహిమ్ కోరారు. మంగళవారం చేజర్ల ఎస్‌వీఎస్‌ఆర్ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. యూనిఫాం, షూస్, సాక్సులు, బ్యాగ్, బెల్టు, నోట్, పాఠ్య పుస్తకాలను అందజేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ లలిత, షేక్ మస్తాన్‌వలి, జీ మోహన్‌రావు, ఏసీహెచ్ వెంకటరావు, పీ సుందరరావు, ఎస్‌కే గౌస్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ 17వ విడత నగదు

బెల్లంకొండ, జూన్ 18: రైతుల ఖాతాల్లో ప్రధానమంత్రి కిసాన్ 17వ విడత నగదు జమ అయినట్టు మండల ఏవో కృష్ణయ్య పేర్కొన్నారు. మంగళవారం బెల్లంకొండ వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదిలో నాలుగు నెలల వ్యవధిలో ఒక్కొక్క రైతుకు రూ.2వేలు చొప్పున మొత్తం రూ.6వేలు నగదు జమ అయినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో షేక్ జాబీర్ హుస్సేన్, మార్కెటింగ్ మేనేజర్ గంగాధర్, వెంకటేష్ పాల్గొన్నారు.

చంద్రాజుపాలెంలో టీడీపీ విజయోత్సవ ర్యాలీ

బెల్లంకొండ, జూన్ 18: మండలంలోని చంద్రాజుపాలెంలో మంగళవారం సాయంత్రం టీడీపీ విజయోత్సవర్యాలీ నిర్వహించారు. నరసరావుపేట పార్లమెంట్ బీసీ సంఘం ప్రధానకార్యదర్శి ఓర్సు ఆనంద్, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు ఆధ్వర్యంలో భారీర్యాలీ నిర్వహించారు. చంద్రాజుపాలెం మెయిన్ రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీ బాణసంచా, డప్పువాయిద్యాలతో ఊరి చివరవరకు కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రానికి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి ఐతేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ఓర్సు రాంబాబు, టీడీపీ నాయకులు లక్ష్మయ్య, వెంకయ్య, కొండలు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

25న ఐటీఐలో క్యాంపస్ ఇంటర్వ్యూ

మాచర్ల రూరల్, జూన్ 18: పట్టణంలోని ప్రభుత్వ గురుకుల పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఈ నెల 25వ తేదీన క్యాంపస్ ఇంటర్వ్యూ జరగనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్‌ఎస్‌వి ప్రసాద్ తెలిపారు. జూలైలో జరిగే పరీక్షలకు హాజరవుతున్న ఐటీఐ అన్ని ట్రేడ్‌ల విద్యార్థులు ఈ ఇంటర్వ్యూకు హాజరుకావచ్చున్నారు. ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూ ప్రారంభమవుతుందని, వివిధ రకాల ప్రముఖ కంపెనీలు హాజరవుతున్నందున ఐటీఐ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తా : ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

రెంటచింతల, జూన్ 18: నియోజకవర్గంలో తేదేపా గెలుపుకోసం అవిశ్రాంతంగా కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తానని, తాను ఎల్లప్పుడు మీ సేవకుడ్నని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గొంటు సుమంత్‌రెడ్డిల నేతృత్వంలో వందలాది మంది బ్రహ్మారెడ్డిని కలిసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ వైసీపీ నేతల ఆరాచకాలు, అక్రమాలు, తప్పుడు కేసులతో టీడీపీ నేతలను శారీరకంగా, మానసికంగా హింసించడం వల్లనే ఫ్యాన్ రెక్కలు విరిగి ముక్కలయ్యాయన్నారు. రెంటచింతల మండలం నుంచి 2909 మెజార్టీ రావడం(41 ఏళ్లలో) అంటే సామాన్యమైన విషయం కాదన్నారు. ఎటువంటి ఘర్షణ వాతావరణం మనకు అక్కర్లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయగానే వైసీపీ బాధితుల కుటుంబాలను పరామర్శిస్తానన్నారు. ఎమ్మెల్యేను కలిసి వారిలో పీహెచ్‌సీ మాజీ ఛైర్మన్ బోడపాటి రామకృష్ణ, రాయపరెడ్డి, ప్రభురాజు యాదవ్, శౌర్రెడ్డితో పాటు అనేక మంది వున్నారు.

శాలువాలు, పూలదండలు తీసుకురావద్దు: ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

మాచర్లటౌన్, జూన్ 19: తనను కలిసేందుకు వచ్చేవారు శాలువాలు, పూలదండలు తీసుకురావద్దని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి కోరారు. ప్రేమను వ్యక్తపరిచే క్రమంలో తనను కలిసేందుకు వచ్చేవారు విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలు, పెన్నులు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

అచ్చంపేటలో విత్తన దుకాణాల్లో తనిఖీ



అచ్చంపేటలో విత్తన షాపును తనిఖీ చేస్తున్న ఏడీఏ కృష్ణదేవరాయలు, వెంకటేశ్వర్లు



క్రోసూరు విత్తన షాపులో తనిఖీలు

అచ్చంపేట, జూన్ 18: మండలంలోని అచ్చంపేట, వేల్పూరు గ్రామాల్లోని విత్తన దుకాణాలను ప్రత్యేక అధికారి, పిడుగురాళ్ళ వ్యవసాయ సహాయ సంచాలకులు పీ కృష్ణ దేవరాయలు, మండల ఏవో వెంకటేశ్వర్లు మంగళవారం తనిఖీ చేశారు. పలు విత్తన దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి షాపులోని స్టాక్‌బోర్డు అప్‌డేట్ చేయాలని, కొనుగోలు చేసిన ప్రతి రైతుకు బిల్లులు ఇవ్వాలన్నారు. రైతులు పంట కాలం పూర్తయ్యే వరకు బిల్లులు దగ్గర ఉంచుకోవాలని తెలిపారు. అనుమతిపత్రాలు లేనిఎడల చర్యలు తీసుకుంటామన్నారు.

క్రోసూరులో...

క్రోసూరు, జూన్ 18: క్రోసూరు మండలంలోని పలు విత్తనాల షాపుల్లో వ్యవసాయ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాపుల్లోని రికార్డులను పరిశీలించారు. డీలర్లకు పలు సూచనలు చేశారు. ప్రిన్సిపల్ సర్టిఫికెట్‌లు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. షాపులో విత్తనాల రకాలు, నిల్వలు, ధరలను సూచించే బోర్డులు ఉండాలన్నారు. రోజు వారి అమ్మకాలకు సంబంధించిన అమ్మకాల, కొనుగోళ్ళ లావాదేవీల నమోదు రిజిస్టర్లు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు కావాల్సిన అన్ని రకాల విత్తనాలను అందుబాటులో ఉంచాలని, విత్తనాలను అధిక ధరలకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో పిడుగురాళ్ళ ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, క్రోసూరు ఏవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనానికి పరాశక్తి సిమెంట్స్ రోల్ మోడల్

వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు

రెంటచింతల, జూన్ 18: పచ్చదనానికి పరిశుభ్రతకు పరాశక్తి సిమెంట్స్ తొలి ప్రాధాన్యత ఇస్తుందని, మిగతా కర్మాగారాలకు పరాశక్తి రోల్‌మోడల్‌గా ఉంటుందని ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు అన్నారు. మంగళవారం పరాశక్తి సిమెంట్స్ 19వ వార్షికోత్సవం ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. కార్యక్రమానికి సీజీఎం జి.. ధర్మారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పరాశక్తి సిమెంట్ పరిధిలోని గ్రామాల అభివృద్ధి తమ నిఘంటువులో ప్రత్యేకంగా ఉందన్నారు. భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలను మరింత విస్తరింప చేసి పరాశక్తి అంటే పల్నాడు అభివృద్ధిలో మమేకమయ్యేలా వ్యవహరిస్తామన్నారు. భారీగా మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, మల్లిఖార్జున, వేణుగోపాలరెడ్డి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రెంటచింతల, జూన్ 18: స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహంలో 3-10వ తరగతి వరకు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలుర విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వార్డెన్ బేగ్ చెప్పారు. ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 95500 67786 సంప్రదించాలని సూచించారు.

మంచికల్లులో ఘర్షణ.. నలుగురిపై కేసు

రెంటచింతల, జూన్ 18: మండలంలోని మంచికల్లు గ్రామంలోని ఎస్సీ కాలనీలో జరిగిన ఘర్షణకు సంబంధించి నల్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు మంగళవారం చెప్పారు. నందా అరుణ్‌కుమార్‌పై మేకల లక్ష్మీనారాయణ, మేకల సైదారావు, శేషు, విజయకుమార్‌లు దాడి చేసి గాయపరిచారన్నారు.

నేడు పట్టణంలో విద్యుత్ కోత

మాచర్ల రూరల్, జూన్ 18: పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో గల బొంబాయి కంపెనీ దగ్గర రోడ్డు వైండింగ్ వర్క్ జరుగుతున్నందున ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ రామయ్య తెలిపారు. పట్టణంలోని వినాయకునిగుట్ట, పాతూరుతోపాటు మండలంలోని లింగాపురం, జమ్మలమడక గ్రామంలో విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిదానంపాటి అమ్మవారి ఆదాయం రూ. 32,36,935

దుర్గి, జూన్ 18: మండలంలోని అడిగొప్పులలో వేంచేసియున్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. 43 రోజులపాటు భక్తులు అమ్మవారిని దర్శించుకొని సమర్పించిన ఆదాయం రూ.32,36,935గా తేల్చారు. ఈ లెక్కింపును ఆలయ కార్యనిర్వహణాధికారి, అసిస్టెంట్ కమిషనర్ సైదమ్మబాయి, కారంపూడి గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి పప్పుల కృష్ణంరాజులు పర్యవేక్షించారు.

ఎంపీని కలిసిన హనుమంతురావు



ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు శుభాకాంక్షలు తెలుపుతున్న హనుమంతరావు

కారంపూడి, జూన్ 18: నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును మంగళవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి హనుమంతురావు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలుపొందడంతో శ్రీకృష్ణదేవరాయలును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ ప్రభుత్వంతోనే విద్యారంగం అభివృద్ధి

ఎమ్మెల్యే ప్రవీణ్ సతీమణి లావణ్య



విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి భాష్యం లావణ్య

క్రోసూరు, జూన్ 18: టీడీపీ ప్రభుత్వంలోనే రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య అన్నారు. మంగళవారం అందుకూరు యూపీస్కూల్‌లో విద్యార్థులకు ఆమె స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అధికారంలోకి రాగానే మొట్టమొదటి సంతకం ఉపాధ్యాయుల నియామక ఫైలుపై చేశారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫారాలు, బూట్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 గణేష్, స్థానిక టీడీపీ నాయకులు తాళ్ళూరి శ్రీనివాసరావు, చావా మురళీ, వాసిరెడ్డి వెంకటరావు, దిగుమర్తి వెంకటగిరి, చావా నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి మొక్కుబడులు చెల్లించుకున్న లావణ్య

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతోపాటు పెదకూరపా డు నియోజకవర్గంలో భాష్యం ప్రవీణ్ గెలవడంతో ఎమ్మెల్యే సతీ మణి లావణ్య మంగళవారం అందుకూరు గ్రామానికి వచ్చి మొ క్కుబడులు చెల్లించుకున్నారు. గ్రామంలోని పోలేరమ్మ తల్లి దేవా లయాన్ని సందర్శించి ఆమె అమ్మవారికి పసుపు, కుంకుమలు, పొంగళ్ళు ప్రత్యేక బోనాలు సమర్పించారు.

అనుమతి లేకుండా నర్సరీలు నిర్వహిస్తే చర్యలు

క్రోసూరు, జూన్ 18: అనుమతులు లేకుండా నర్సరీలు నిర్వహించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి ఉద్యాన అధికారి నవీన్ హెచ్చరించారు. క్రోసూరు మండలంలోని అనుమతులు లేని పలువురు నర్సరీల యజమానులకు మంగళవారం నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల యజమానులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, దగ్గరలో ఉన్న ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలన్నారు. గతంలో రిజిస్ట్రేషన్‌లు చేయించుకున్న వారు రెన్యువల్ చేయించుకోవాలన్నారు. నోటీసులు అందిన ఏడు రోజుల్లో రిజిస్ట్రేషన్‌లు పొందక పోతే చర్యలు తీసుకుంటామన్నారు. యజమానులు స్టాక్ రిజిస్టర్, సేల్స్ రిజిస్టర్, నర్సరీ మెయింటెనెన్స్ రిజిస్టర్, తనిఖీ అధికారి రిజిస్టర్, రసీదు పుస్తకాలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



ప్రజా వేదికలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జూన్ 18: సత్తెనపల్లి నియోజకవర్గంలో అంగన్‌వాడీలు, ఆశాలు, డ్వాక్రా మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో మంగళవారం పలువురు అంగన్ వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, డ్వాక్రా మహిళలు కన్నా లక్ష్మీనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్ళాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంలో మహిళల పాత్ర కూడా ఉందన్నారు. నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు కన్నా వారికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో టీడీపీ నేతలు ఆళ్ళ అమరేశ్వరరావు, ఆళ్ళ సాంబయ్య, టీ భావన్నారాయణ, ఇంకొల్లు మారుతీ, అంగన్ వాడీ నాయకులు, డ్వాక్రా లీడర్లు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్యే ప్రవీణ్ పరామర్శ

ప్రమాదంలో నవ వధువు భర్త మృతి.. హసానాబాద్‌లో విషాదం



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

క్రోసూరు, జూన్ 18: శ్రీశైలం సమీపంలోని త్రిపురాంతకం వద్ద రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో క్రోసూరు మండలం హసానాబాద్ గ్రామస్తులు పలువురు గాయపడ్డారు. నరసరావుపేటలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్సపొందుతున్న వారిని మంగళవారం భాష్యం ప్రవీణ్ పరామర్శించారు. గాయపడ్డ వారంతా మొక్కుబడులు చెల్లించుకొనేందుకు శ్రీశైలం, త్రిపురాంతకానికి ప్రత్యేక వాహనంలో వెళ్తుండగా సంఘటన జరిగినట్టుగా చెపుతున్నారు. ఈ ప్రమాదంలో హసానాబాద్‌కి చెందిన శాలిని అనే మహిళ భర్త చర్ల సాయి(29) మరణించినట్టు గ్రామస్తులు తెలిపారు. మృతునిది సంతమాగులూరు కాగా మృతదేహాన్ని గుంటూరు మార్చురీకి తరలించారు. ఎమ్మెల్యే ప్రవీణ్ అక్కడకు కూడా వెళ్ళి మృతదేహాన్ని సందర్శించి బంధువులను పరామర్శించారు. నరసరావుపేటలో చికిత్స పొందుతున్న మృతిని భార్య శాలినితో పాటు ఇతర క్షత గాత్రులను ఆయన పరామర్శించారు. గాయపడ్డ వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ఆయనతోపాటు టీడీపీ రాష్ట్ర నాయకులు నల్లపాటి రాము, లేళ్ళ వెంకటరావు, యర్రంశెట్టి రామకృష్ణ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ

అర్హులందరికీ కౌలు రైతు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

నకరికల్లు, జూన్ 18: అర్హులందరికీ కౌలురైతు గుర్తింపుకార్డులను మంజూరు చేయాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలు, వ్యవసాయ శాఖ అధికారులతో తహసీల్దార్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి కౌలు రైతుకు పంట సాగు హక్కు ధృవీకరణ పత్రాన్ని వీఆర్‌వో వద్ద లేదా రైతు భరోసా కేంద్రంలోని ఉద్యోగిని సంప్రదించి కౌలు రైతు గుర్తింపు కార్డులను పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో కే దేవదాను, వ్యవసాయ శాఖ ఉద్యోగులు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



విచారణ చేస్తున్న ఏపీడీలు సుధాకర్, బూసిరెడ్డి

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

ఈపూరు, జూన్ 18: మండలంలోని బొమ్మరాజుపల్లి ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతికి పాల్పడ్డాడని గ్రామస్థులు పీడీకి ఫిర్యాదు చేశారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు నరసరావుపేట, వినుకొండ ఏపీడీలు సుధాకర్, బూసిరెడ్డిలు మంగళవారం విచారణ జరిపారు. అమెరికాలో ఉన్నవారికి ఉపాధి పనులకు హాజరైనట్లు మస్టర్లు వేస్తున్నారని, గ్రామసర్పంచ్ బంధువులు పనులకు వెళ్లకపోయినా ఫీల్డ్ అసిస్టెంట్ మస్టర్లు వేశాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు అధికారులు తెలిపారు. విచారణకు ముందే ఫీల్డ్ అసిస్టెంట్ రాజీనామా చేసినట్లు అధికారులు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఏపీడీ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీనివాసరావు, పక్కన సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ రామిరెడ్డి, డీఈ వెంకటేశ్వరరెడ్డి

విద్యుత్ బకాయిలను సకాలంలో వసూలు చేయాలి

● ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీనివాసరావు

రొంపిచర్ల, జూన్ 18: రొంపిచర్ల, నకరికల్లు, ఈపూరు, శావల్యాపురం మండలాల పరిధిలో విద్యుత్ బకాయిలను సకాలంలో వసూలు చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మండల కేంద్రమైన రొంపిచర్ల విద్యుత్ శాఖ సబ్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. విద్యుత్‌లైన్‌ల మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు తదితర అంశాల గురించి మాట్లాడారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేలా సిబ్బంది వ్యవహరించాలని కోరారు. సమస్య వచ్చిన వెంటనే పరిష్కరించేలా చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ అధికారి రామిరెడ్డి, డీఈ వెంకటేశ్వరరెడ్డి, రొంపిచర్ల, నకరికల్లు, శావల్యాపురం, ఈపూరు మండలాల ఏఈలు, విద్యుత్ రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, ఓఅండ్‌ఎం సిబ్బంది పాల్గొన్నారు.

164మంది బడిబయటి పిల్లలు పాఠశాలల్లో చేరిక

శావల్యాపురం, జూన్ 18: బడిబయటి పిల్లల్ని పాఠశాలలో చేర్పేందుకు ప్రభుత్వం నూతనంగా చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమం ద్వారా మండలంలోని 15 గ్రామపంచాయతీలలో వివిధ కారణాలతో పాఠశాలలకు దూరంగా ఉన్న 164మంది బడిబయటి పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలలో చేర్పినట్లు ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు మంగళవారం తెలిపారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు నేను బడికి పోతా కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో నిర్వహించడం జరిగిందని, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు విస్తృతంగా గ్రామాల్లో పర్యటించి బడిబయటి పిల్లల తల్లిదండ్రులను కలసి ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, విద్య ఆవశ్యకతను వివరించినట్లు తెలిపారు. గతేడాది మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలలో 2366మంది విద్యార్థులు ఉండగా ఈ ఏడాది 2528మంది విద్యార్థులున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు మంచి విద్యాబోధనతో విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచి వారిని తీర్చిదిద్దాలన్నారు.

సుబ్బయ్యపాలెంలో పిడుగు పడి ముగ్గురికి గాయాలు

రొంపిచర్ల, జూన్ 18: మండలంలోని సుబ్బయ్యపాలెంలో మంగళవారం పిడుగు పడటంతో గ్రామానికి చెందిన ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన చలంచర్ల ఆంజనేయులు, ఏలూరి మునలయ్య, తొలుచూరి అంజయ్యలు గొర్రెలు కాయటానికి పొలం వెళ్లారు. పక్కనే చెట్టు దగ్గర పిడుగు పడటంతో వీరికి గాయాలయ్యాయి. ఆంజనేయులు, మునలయ్య నరసరావుపేటలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.



కర్లకుంటలో జరిగిన విజయోత్సవాల్లో పాల్గొన్న అరవిందబాబు

రాష్ట్రంలో అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

● ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

రొంపిచర్ల, జూన్ 18: రాష్ట్రంలో అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని కర్లకుంటలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరిగిన విజయోత్సవ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అభ్యర్థులకు ప్రజలు ఘన విజయాన్ని అందించారన్నారు. ఈ విజయాన్ని రాష్ట్ర ప్రజలకు అంకితమిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహణ కార్యదర్శులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, నల్లపాటి రామచంద్రప్రసాదు, వేల్పుల సింహాద్రియాదవ్, కపలవాయి విజయకుమార్, వడ్లమూడి వెంకట కిషోర్, పులకూరి జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్, పొనుగోటి రామారావు, ఇమ్మడిశెట్టి కాశయ్య, మండలంలోని గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాల్లో అధిక ఫీజులు తగదు

● సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు

వినుకొండ టౌన్, జూన్ 18: ప్రభుత్వ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేయటం తగదని, దీనిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు మంగళవారం తెలిపారు. అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠశాలల్లో చదివే విద్యార్థులు తమవద్దనే పాఠ్యపుస్తకాలు కొనుగోలు చేయాలనే నిబంధనలను విరమించుకోవాలని సూచించారు. పాఠశాల బస్సులు ఫిట్నెస్ లేకుండా, నిబంధనలకు వ్యతిరేకంగా పిల్లలను తరలించడం తగదన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలు అనుసరించి పాఠశాలల్లో ఫీజులు వసూలు చేయకపోతే, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు ఎస్‌కే ఫిరోజ్, పల్లపాటి భాస్కర్, సంఘం దుర్గాప్రసాద్, కామా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఆల్ ఇండియా మొదటి ర్యాంక్ సాధించిన జయహరీష్ సన్మానిస్తున్న ఆలయ కమిటీ పెద్దలు

మొదటి ర్యాంకర్ జయ హరీష్‌కు ఘన సన్మానం

వినుకొండ, జూన్ 18: సూపర్ స్పెషాలిటీ పల్మనాలజీ, క్రిటికల్ కేర్ పరీక్షా ఫలితాల్లో ఆల్ ఇండియా మొదటి ర్యాంక్ సాధించిన వినుకొండకు చెందిన గుండాల జయహరీష్‌ను పుట్టాబత్తుని ఆంజనేయస్వామి దేవస్థానం కమిటీ సభ్యులు మంగళవారం ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందచేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు ననిశెట్టి వెంకట సుబ్రమణ్యం అప్పారావు మాట్లాడుతూ వినుకొండ ఆర్టీసీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న గుండాల నరసిహారావు కుమారుడు జయహరీష్ భారతదేశంలో మొదటి ర్యాంక్ సాధించడం వినుకొండకు గర్వకారనమన్నారు. కార్యక్రమంలో గుడిపాటి బాలరావు, కన్నెగండ్ల అనంత కోటేశ్వరరావు, మహిళ భక్తులు వరలక్ష్మీకుమారి, తాతా శ్రీలక్ష్మీ, పెండెల రోహిణీ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా అన్నవరం మేజరు కాలువ

○ పిచ్చి చెట్లతో మూసుకుపోయిన కాలువ
○ అడుగడుగునా ప్రవాహానికి అవాంతరాలు
○ తీవ్ర ఇక్కట్లకు గురవుతున్న రైతులు



అన్నవరం మేజరు కాలువలోని పిచ్చి చెట్లను చూపిస్తున్న రైతు, చెట్లతో మూసుకుపోయిన కాలువ

రొంపిచర్ల, జూన్ 18: మండలంలోని పలు గ్రామాలకు తాగు, సాగునీరు అందించే అన్నవరం మేజరు పిచ్చి చెట్లతో మూసుకుపోయింది. నకరికల్లు మండలం అద్దంకి బ్రాంచ్ కెనాల్ నుంచి రొంపిచర్ల మండలంలోని కర్లకుంట, అన్నవరం, మునమాక, ఇంద్రగిరి తదితర గ్రామాల రైతుల పొలాలకు ఈ మేజరు ద్వారా సాగు నీరు ప్రవహిస్తోంది. గత కొన్నేళ్ళుగా ఈ మేజరును అటు ప్రజా ప్రతినిధులు, ఎన్ఎస్‌పీ అధికారులు పట్టించుకోకపోవటంతో అధ్వానంగా తయారైంది. అడుగడుగునా నీటి ప్రవాహానికి అవాంతరాలు ఏర్పడుతున్నాయి. పొలాలు సాగు చేసుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదని రైతులు పేర్కొన్నారు. షట్టర్లు కూడా పిచ్చిచెట్ల నడుమ మూసుకుపోయి ఉన్నాయి. షట్టర్లు తుప్పుపట్టి శిథిలావస్థలో ఉన్నాయి. పిచ్చిచెట్లతో మేజరు పొడవునా అధ్వానంగా తయారైంది. కాలువకట్టపై ద్విచక్ర వాహన దారులు వెళ్ళాలన్నా భయాందోళనలు కలుగుతున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు నిర్వహించాలని కోరుతున్నారు.



పిచ్చి చెట్లతో నిండి ఉన్న అన్నవరం మేజరు, పిచ్చిమొక్కల్లో కలిసిపోయిన షట్టరు

పౌర సేవల్లో ప్రజాపాలన ముద్ర కన్పించాలి

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూన్ 18: పౌర సేవల అభివృద్ధిలో ప్రజాపాలన ముద్ర కన్పించాలని, ఈ దిశగా తక్షణం కార్యాచరణ ప్రారంభించాలని అధికారులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మునిసిపల్ పౌర సరఫరాల శాఖల అధికారులతో ప్రత్తిపాటి సమీక్షించారు. తాగు నీరు, పారిశుద్ధ్యంపై అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షాకాలం నేపథ్యంలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, కలుషితనీరు, అపరిశుభ్ర పరిసరాల వల్ల తలెత్తే అనారోగ్య సమస్యలపై అన్ని విధాలుగా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి తెలుసుకొని పెండింగ్ పనుల పురోగతిని సమీక్షించి త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో చీకటిపాలన అంతమైందని, ఇక అభివృద్ధే లక్ష్యంగా తమ పాలన సాగుతుందని, తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రారంభమై మధ్యలోనే ఆగిపోయిన ప్రాజెక్టులకు కూడా మోక్షం లభిస్తుందని, ప్రభుత్వ సహకారంతో ఇకపై చిలకలూరిపేట అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నియోజక వర్గంలోని సమస్యలను అధిగమించటానికి తీసుకోవాల్సిన చర్యలు ఏమిటో అధికారుల సలహాలు, సూచనలు చెబితే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక రూపొందించాలని సూచించారు. టిడ్కో గృహ సముదాయంలో మౌలిక వసతుల కల్పనతో పాటు అక్కడికి వెళ్ళే రహదారిని బాగు చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న టిడ్కో గృహాలను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అతి త్వరలో చిలకలూరిపేటలో అన్న క్యాంటీన్‌లు ప్రారంభించి నిరుపేదలకు ఐదు రూపాయలకు మంచి భోజనం అందిస్తామని తెలిపారు. అన్న క్యాంటీన్ భవనాలకు మరమ్మతులు చేసి పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. రేషన్ పంపిణీపై పౌర సరఫరాల శాఖ డీటీతో చర్చించారు. అగ్నిమాపకశాఖ అధికారులతో పాటు పలు ప్రభుత్వ శాఖల అధికారులు ప్రత్తిపాటిని మర్యాదపూర్వకంగా కలసి వారిని పరిచయం చేసుకొని శాఖల గురించి వివరించి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.



మునిసిపల్, పౌర సరఫరాల శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ప్రత్తిపాటి

ఎమ్మెల్యేలకు ఆదర్శం మంత్రి లోకేశ్ ప్రజాదర్బార్: ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, జూన్ 18: రాష్ట్ర శాసన సభ్యులందరికీ మంత్రి నారా లోకేశ్ చేపట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమం ఆదర్శం కానుందని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని ఆయన నివాసంలో ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శేష వస్త్రంతో సత్కరించి తిరుమల శ్రీవారి ప్రసాదం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 12వ తేదీ కూటమి ప్రభుత్వం కొలువుదీరిన రోజు నుంచి ప్రజలందరిలో మార్పు మొదలైందని, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా లోకేశ్ చేపట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించటం శుభ పరిణామమన్నారు. ఓటు వేసి గెలిపించిన ప్రజల సమస్యలు, కష్టాలు నేరుగా విని పరిష్కారం చూపటంలో ఉన్న సంతృప్తి మరెక్కడా రాదన్నారు. ఇదే బాటలో కొత్త, పాత ఎమ్మెల్యేలంతా నడిస్తే కూటమి ప్రజా ప్రభుత్వానికి తిరుగు ఉండదన్నారు. మూడు దశాబ్దాలుగా చిలకలూరిపేట ప్రజలతో తన అనుబంధం కూడా ఇదే పంథాలో సాగుతుందని, ప్రజల్లో ప్రభుత్వంపై, పార్టీ పట్ల నమ్మకం కలిగించటంలో విజయవంతమయ్యామని, వైసీపీకి, టీడీపీకి మధ్య తేడా ప్రజలు గమనించారన్నారు. నారా లోకేశ్‌ను కలసిన వారిలో చిలకలూరిపేట మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



లోకేశ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పక్కన మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావు

నియోజకవర్గంలో సమస్యలు లేకుండా చేయడమే లక్ష్యం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



తాగునీటి చెరువును అధికారులతో కలిసి పరిశీలిస్తున్న అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూన్ 18: నరసరావుపేట నియోజకవర్గంలో సమస్యలు లేకుండా చేయటమే మొదటి లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ అతిథి గృహంలో మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో, తహసీల్దార్, మైనింగ్ అధికారులతో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ పట్టణంలోని డంపింగ్ యార్డుపై ప్రజల నుంచి అనేక ఫిర్యాదులొస్తున్నాయని, పది రోజులలో సమస్య పరిష్కరించాలని కమిషనర్‌కు సూచించారు. ప్రైవేట్ ల్యాండ్ అయినా తీసుకొని సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. అదే సమయంలో తాగునీరు ఒక్క పూట మాత్రమే ఇస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలలో లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లను వీలైనంత త్వరగా మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య సమస్యను పరిష్కారించాలన్నారు. నియోజవర్గంలో మట్టి మాఫియాను సమూలంగా నిర్మూలించేందుకు చొరవ చూపాలన్నారు. ప్రతినెల ఏదో ఒక రోజు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిద్దామని, ప్రతి అధికారి సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బులియన్ మర్చంట్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, వేల్పుల సింహాద్రియాదవ్, చిన్నపరెడ్డి, కొట్టా కిరణ్‌కుమార, కొప్పూరు బాబు, గూడూరు శేఖర్ అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కారిస్తాం: అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూన్ 18: ప్రజలకు శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారించేందుకు చొరవ చూపుతున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం శాంతినగర్‌లోని తాగునీటి చెరువును అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ప్రజలకు ఎన్నికల సందర్భంగా ఇచ్చి ప్రతి హామీని పరిష్కరించే వరకు తప్పకుండా శ్రమిస్తానన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం, దోపిడీ కారణంగా ప్రజలు గుక్కెడు తాగునీటి కోసం కూడా అవస్థలు పడాల్సి వచ్చిందన్నారు. కానీ ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలక మెరుగైన సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు, కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రరెడ్డి, డీఈ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల పాదయాత్రకు సంఘీభావం

శావల్యాపురం, జూన్ 18: సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి చారిత్రాత్మక విజయంపై అద్దంకి నియోజకవర్గం బల్లికురవ మండలం ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన 15మంది టీడీపీ కార్యకర్తలు మల్లిఖార్జునస్వామికి మొక్కుబడులు తీర్చుకొనేందుకు పాదయాత్రగా శ్రీశైలానికి బయలుదేరారు. పాదయాత్రలో భాగంగా సోమవారం రాత్రి శావల్యాపురానికి చేరుకొన్న టీడీపీ కార్యకర్తలకు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శావల్యాపురం సెంటర్లో కలసి సంఘీబావాన్ని తెలియజేసి వారికి అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయడంతో పాటు అద్దంకి ఎమ్మెల్యేగా గొట్టిపాటి రవికుమార్ అఖండ మెజారిటీతో గెలుపొందడంపై ఆనందాన్ని వ్యక్తం చేశారు. సంఘీబావం తెలిపిన వారిలో టీడీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు నలమాటి వెంకటేష్, టీడీపీ నాయకులు మందలపు వెంకటనారాయణ, చెవల వెంకటకృష్ణయ్య, పత్తిపాటి కోటిలింగం, చెరుకూరి హనుమంతరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేత

బొల్లాపల్లి, జూన్ 18: మండలంలోని బొల్లాపల్లి వెల్లటూరు జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు వెల్లటూరు గ్రామంలోని కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిభా పురస్కారాలను అందజేశారు. 571 మార్కులు సాధించిన జీ రామానంద భరద్వాజ్‌కు రూ.5వేలు, బీ జశ్వంత్‌కు (570)కి రూ.3వేలు, ఏ బిందు ప్రియ (551) రూ.2వేలు నగదును సేవా సమితి సభ్యులు పల్నాటి బ్రహ్మయ్య, మాజీ సర్పంచ్ అర్వలపూడి వెంకట నారాయణ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ అలీషా, విద్యార్థులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా రామదూత స్వామి జన్మదినం

వినుకొండ, జూన్ 18: రామ దూత స్వామి జన్మదినంను పురస్కరించుకుని వినుకొండలోని ఆర్‌టీసీ బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం స్వామి భక్త బృందం పలు కార్యక్రమాలు నిర్వమించారు. స్వామి వారి చిత్రపటానికి పూలమావేసి, అనంతరం నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహంచారు. ఆదేవిదంగా జమ్ములదిన్నె ఆంజనేయులు కుటుంబ సభ్యులు నిరుపేదలకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజయేంద్ర, యలమంచిలి రమేష్, బాబు, ఆర్మీచిన వెంకన్న ఆంజినేయలు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల, జూన్ 18: మండలంలోని సాతులూరులోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో గురువారం 7వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా 108 కలశాలతో అష్టోత్తర కలాభిషేకం, శాంతి కల్యాణం, శాంతి హోమం తదితర పూజలను నిర్వహిస్తామన్నారు. శుక్రవారం అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు.



ట్రాక్టర్‌తో చెరువు కట్టను చదును చేస్తున్న ఆక్రమణదారులు

సాగుకోసం కొచ్చెర్ల చెరువు ఆక్రమణ

కొచ్చెర్ల (ఈపూరు) జూన్18: మండలంలోని కొచ్చెర్ల చెరువును కొందరు ఆక్రమిస్తున్నారు. కట్టను చదును చేసి పొలంలో కలుపుకుంటున్నారు. అందుకు ట్రాక్టర్లతో మట్టితో తోలి చదును చేస్తున్నారు. చెరువును ఆక్రమించి అందులో బావి తవ్వారు. ఇప్పటికే చెరువు సుమారు పది ఎకరాల వరకు ఆక్రమణకు గురైందని గ్రామస్థులు తెలిపారు. సర్వేనంబరు 457.బీలో 37.56 ఎకరాలు విస్తీర్ణంలో చెరువు ఉంది. కాని ప్రస్తుతం సుమారు 10 ఎకరాలు ఆక్రమణకు గురైందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణల విషయం తహసీల్దారు దిలీప్‌కుమార్‌ను అడగగా ఆక్రమణల విషయం గ్రామస్థులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. అయితే రైతులు తమ భూములను మట్టితో చదును చేస్తున్నట్లు తెలిసిందన్నారు. వీఆర్వోను పంపి పూర్తి సమాచారం తెలుసుకొని ఆక్రమణలు నిజమైతే చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, జూన్ 18: పట్టణంలోని కొమరవల్లిపాడు - చీరాల అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ భుసీల రాజ్యలక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో 16 రోజుల పండుగను పురస్కరించుకొని మంగళవారం శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు స్వామివారి పూజల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ప్రారంభించారు. ఇక్కడి పూజారులు స్వామి వారి శేష వస్త్రాన్ని బహూకరించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నేడు విద్యుత్ సరఫరా నిలివేత

నాదెండ్ల, జూన్ 18 : మండలంలోని నాదెండ్ల సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8:30 గంటల నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. ఈ మరమ్మతుల వల్ల నాదెండ్ల, తూబాడు, చిరుమామిళ్ళ, జంగాలపల్లి, సంక్రాంతిపాడు, గొరిజవోలు గ్రామాల్లో ఆ సమయాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డుల కోసం నేటి నుంచి గ్రామ సభలు

చిలకలూరిపేట, జూన్ 18: చిలకలూరిపేట మండలంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసేందుకై ఈ నెల 19 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు ఆయా తేదీల్లో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చిలకలూరిపేట తహసీల్దార్ జ్వాలా నరసింహం మంగళవారం తెలిపారు. కౌలు రైతుల గుర్తింపు కార్డు కోసం సభల్లో దరఖాస్తులు పెట్టుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. కాగా ఈ నెలలో 19వ తేదీన పురుషోత్తమపట్నంలో, 20న తాతపూడిలో, 21న మురికిపూడిలో, 22న బొప్పూడిలో, 24న వేలూరులో, 25న మానుకొండవారిపాలెంలో గ్రామ సభలు నిర్వహించటం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ నెల 26న గొట్టిపాడులో, 27, పసుమర్రు-1లో, 28న పసుమర్రు-2లో, 29న ఎడవల్లిలో గ్రామ సభలు జరుగుతాయని తెలిపారు. జూలై 1న రాజాపేటలో, 2న పోతవరంలో, 3న, లింగంగుంట్లలో, 4న కావూరులో, 5న గోవిందపురంలో, 6న గంగన్నపాలెంలో గ్రామ సభలు ఉంటాయని పేర్కొన్నారు. కౌలు రైతులు ఆయా తేదీల్లో సభలకు హాజరై గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియలో పాల్గొనాలని కోరారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏవో సరిత

సీసీఆర్‌సీ కార్డుల మంజూరుపై అవగాహన

యడ్లపాడు, జూన్ 18: సీసీఆర్‌సీ (కౌలు రైతు గుర్తింపు కార్డులు) కార్డుల మంజూరు, పాటించవలసిన నిబంధనలపై వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో ఏవో సీహెచ్ సరిత ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ భూయజమానికి, సాగుదారునికి మధ్య కుదిరిన 11 నెలల అంగీకారపత్రం సీసీఆర్‌సీ కార్డులు అన్నారు. సీసీఆర్‌సీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలనుకునే కౌలు రైతులు స్థానిక వీఆర్వో లేదా వ్యవసాయ సహాయకుల నుంచి పొందవచ్చన్నారు. పూర్తిచేసిన దరఖాస్తుతోపాటు భూయజమాని వివరాలు, కౌలుదారుని ఆధార్, ఫొటోలను జతచేసి రెవెన్యూ లేదా వ్యవసాయాధికారులకు అందజేయాలన్నారు. వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తరువాతనే మంజూరు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్యామలత, వీఆర్వోలు, వ్యవసాయసహాయకులు పాల్గొన్నారు.

తిమ్మాపురం ప్రాథమిక పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

తిమ్మాపురం (యడ్లపాడు), జూన్ 18: యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ పీడీ కె ఉమారాణి మంగళవారం సందర్శించారు. రెండు కేంద్రాలలో 5, 6 సంవత్సరాల వయస్సు గల చిన్నారులను స్థానిక మండల ప్రాథమిక పాఠశాల (ఎల్‌ఈ)లో 1వ తరగతిలో చేర్పించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలసి గ్రాడ్యుయేషన్‌డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో శాంతకుమారి, ఏసీడీపీవో బి నిర్మలారాణి, సూపర్‌వైజర్ కె వెంకటరమణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి: పీడీ

నాదెండ్ల, జూన్ 18: మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ పీడీ కే ఉమారాణి అన్నారు. మండలంలోని నాదెండ్ల ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రాడ్యుయేషన్‌డేను పురస్కరించుకొని మంగళవారం చిన్నారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు బలవర్ధక పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీడీపీవో శాంత కుమారి, ఏసీడీపీవో నిర్మలా రాణి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

5345మందికి పీఎం కిసాన్ పథకం వర్తింపు

శావల్యాపురం, జూన్ 18: మండలంలోని 11 సచివాలయాల పరిధిలో 5345మంది రైతులకు పీఎం కిసాన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం వర్తింపజేయనున్నట్లు మండల వ్యవసాయశాఖాధికారి పల్లపోతు ప్రవీణ్ తెలిపారు. శావల్యాపురం రైతుభరోసా కేంద్రంలో మంగళవారం పీఎం కిసాన్ పథకం లాంచింగ్‌కు సంబంధించిన ప్రత్యక్షప్రసారాన్ని మండల, గ్రామస్థాయి అధికారులు రైతులతో కలసి వీక్షించారు. అనంతరం పీఎం నరేంద్ర మోడీ ఇచ్చిన సందేశాన్ని విన్నారు. తహసీల్దార్ నక్కా లక్ష్మీలావణ్య మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున పంటలకు పెట్టుబడుల నిమిత్తం పీఎం కిసాన్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.2వేలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీఎం కిసాన్ 17వ విడతగా మండలంలోని 5345మంది రైతులకు రూ.1.69కోట్లను కేంద్ర ప్రభుత్వం త్వరలో రైతుల బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తుందన్నారు. నగదు జమకాని రైతులు ఉంటే ఆర్‌బీకేల్లో వీఏఏలను కలసి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. డీటీ వెంకటనాగరాజు, వీఆర్వోలు రాధ, అమల, దేవమ్మ, వీఏఏ వెంకాయమ్మ పాల్గొన్నారు.